బుధవారం
23-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 151
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

## రక్షకులే భక్షకులు!

ప్రపంచవ్యాప్తంగా మహిళలకు వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు.

2లో

# నేరచట్రంలో ప్రజాప్రతినిధులు

- 5 వేల మంది ఎంపీ, ఎమ్మెల్యేలపై నేర కేసులు పెండింగ్
- నానాటికీ పెరుగుతున్న వైనం
- సుప్రీంకు వెల్లడించిన హన్సారియా నివేదిక

**న్యూఢిల్లీ:** దేశంలో నేర కేసులు ఎదుర్కొంటున్న ఎంపీ, ఎమ్మెల్యేల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. 2022 నవంబర్ నాటికి దేశంలో 5,097 మంది తాజా, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా నివేదిక తెలిపింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డివై చంద్రచూడ్‌కు నవంబర్ 14న ఈ నివేదికను సమర్పించారు. నేర కేసులు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధుల సంఖ్య డిసెంబర్ 2018లో 4,122 నుంచి ప్రస్తుతం 5,097కి చేరుకుంది. అయితే సమాచారం అందుబాటులో లేకపోవడంతో రాజస్థాన్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, లడఖ్‌లోని కేసులను చేర్చలేదు. శాసనసభ్యులపై క్రిమినల్ కేసులకు సంబంధించి న్యాయవాది, బీజేపీ నాయకుడు అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ 2016లో వేసిన పిటిషన్‌పై విచారణలో ఈ సమర్పణలు అత్యున్నత న్యాయస్థానానికి అందించారు. అత్యున్నత న్యాయస్థానం ఈ అంశాన్ని సీజ్ చేసినప్పటికీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు పెరుగుతూనే ఉన్నాయని అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పించారు. ప్రస్తుత విచారణలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యకు సంబంధించిన సమర్పణలు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)

- మిగతా 2 లో



# కేరళలో రోజువారీ వేతనం అధికం

- అగ్రస్థానంలో నిలిచిన వామపక్ష పాలిత రాష్ట్రం
- పారిశ్రామిక రాష్ట్రాల్లో తక్కువ వేతనాలు
- ఏపీలో 409 రూపాయిలే... జమ్ముకశ్మీర్‌లో రూ.500కి పైబడే...

**న్యూఢిల్లీ:** కేరళ, జమ్ముకశ్మీర్, తమిళనాడు కార్మికుల రోజువారీ వేతన రేటులో అగ్రస్థానంలో ఉన్నాయి. కానీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్రలో వేతనాలు తక్కువగా ఉన్నాయని భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తెలిపింది. దేశంలోని రాష్ట్రాలపై ఆర్‌బీఐకి చెందిన తాజా గణాంకాల హ్యాండ్‌బుక్ 2022-23 ఆర్థిక సంవత్సరంలో... కేరళలో నిర్మాణ కార్మికుల సగటు

- మిగతా 2 లో

# 'స్పెర్మ్' దందా...!

బ్లాక్ మార్కెట్‌కు పశువుల మందులు

- రూ.2 వేల నుంచి రూ.5 వేలకు విక్రయం
- ఇద్దరు అధికారుల చేతివాటం
- ప్రభుత్వానికి ఫిర్యాదుల వెల్లువ

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** పశువైద్యశాలల్లో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రభుత్వపరంగా ఉచితంగా విక్రయించాల్సిన మందులు చాలాచోట్ల బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నాయి. అర్హులైన పశువుల యజమానులకు ఇవ్వకుండా మధ్యవర్తులు, ఏజెన్సీలతో అధికార యంత్రాంగం కుమ్మక్కై కోట్లకు పడగలెత్తుతోంది. ప్రధానంగా పశువులకు వినియోగించే స్పెర్మ్ (కృత్రిమగర్భం కోసం) ఇంజక్షన్లను మార్కెట్లో రూ. 2వేల నుంచి రూ. 5వేలకు విక్రయిస్తూ భారీ దందాకు పాల్పడుతున్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మందులు నల్లబజారుకు తరలింపులో ఇద్దరు అధికారులు కీలకపాత్ర పోషిస్తూ...అతి తక్కువ కాలంలోనే ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఏఐవైఎఫ్ నాయకులు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, మంత్రులు విడదల రజని, సీదిరి అప్పలరాజుకు వినతిపత్రాలు అందించినప్పటికీ స్పందన లేదు. పశు వైద్యశాలల్లో మందుల పంపిణీలో అవకతవకలు, కృత్రిమ కొరత సృష్టించడం, స్పెర్మ్‌ను అధిక ధరకు విక్రయించడంపై నిత్యం

- మిగతా 2 లో

## మహిళా రిజర్వేషన్ల కోసం సుప్రీంకు ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ

**న్యూఢిల్లీ:** మహిళా రిజర్వేషన్లపై భారత్ జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శి అనీరాజా పిటిషన్‌ను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ తరపున ఈ పిటిషన్‌ను ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దాఖలు చేశారు. 2023, మార్చి 3న దీనిని న్యాయస్థానం విచారించనుంది. కేంద్రప్రభుత్వానికి, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)తో సహా పది రాజకీయ పార్టీలకు నోటీసులను సుప్రీంకోర్టు పంపింది. పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును 1996లో సీపీఐ ఎంపీ గీతా ముఖర్జీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అప్పటినుంచి ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదం కోసం సీపీఐ, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నిరంతరాయంగా పోరాడుతున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించిందిగానీ లోక్‌సభలో దీనిని ఇంకా ప్రవేశపెట్టాల్సి ఉంది.

# మళ్లీ మొక్కుబడేనా ?

- ఎనిమిదిన్నరేళ్లుగా పరిష్కారం కాని విభజన సమస్యలు
- నేడు పెండింగ్ అంశాలపై కేంద్రం కీలక సమావేశం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** సుదీర్ఘకాలం తర్వాత కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ అధ్వర్యంలో ఏపీ పెండింగ్ అంశాలపై బుధవారం దిల్లీలో తొలిసారి కీలక సమావేశం జరుగనుంది. విభజన చట్టంలో ఏపీ కోసం ప్రత్యేకంగా ఇచ్చిన హామీలు, నెరవేర్చిన అంశాలు, ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటిపై ఈ సమావేశం సమీక్షించబోతోంది. ఈ మేరకు కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న ఏపీ విభజన అంశాల జాబితాను ఈ నెల మొదటివారంలోనే అందించాలని ఏపీకి కేబినెట్ సెక్రటేరియట్ ఆదేశించింది. ఆయా మంత్రిత్వ శాఖల వద్ద ఏపీకి సంబంధించిన పెండింగ్ అంశాల జాబితాను పంపాలని కోరింది. కేబినెట్ సచివాలయంలోని కేంద్ర, రాష్ట్రాల సమన్వయ కార్యదర్శి నేతృత్వంలో సమావేశం జరగనుండగా, పెండింగ్ అంశాల జాబితాను అప్‌డేట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి సూచిస్తూ గత నెల 31వ తేదీన కేబినెట్ సెక్రటేరియట్ లేఖ

- మిగతా 2 లో

## సులభతర వాణిజ్యం సరే...

# పరిశ్రమలేవి?

సీఎం వైఎస్ జగన్ చేతకాని పాలనతో రాష్ట్రం తిరోగమన బాట పట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. జగన్ అధికారం చేపట్టి మూడున్నరేళ్లయినా అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించి...పరిశ్రమలు తీసుకురావడం ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం...బెదరింపులు, దౌర్జన్యాలతో వచ్చిన పరిశ్రమలను వెనక్కి పంపుతోందని మండిపడ్డారు.

8 లో

రూ.10 కోట్ల లంచంతోనే జాకీ పరిశ్రమ వెనక్కి

- జగన్ పాలనతో రాష్ట్రం తిరోగమనం
- కడప ఉక్కు సంగతేంటి?
- మేనల్లుడికి రూ.10 వేల కోట్ల లబ్ధి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రభుత్వ వైద్య కళాశాల్లో

# సీనియర్ రెసిడెన్సీ పోస్టుల భర్తీ నిలిపివేత

- 24 గంటల వ్యవధిలో ఇది హైకోర్టు నిలిపివేసిన రెండో నోటిఫికేషన్

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** వైసీపీ ప్రభుత్వానికి హైకోర్టు మళ్లీ ఝలక్ ఇచ్చింది. ప్రభుత్వ వైద్య కళాశాల్లో సీనియర్ రెసిడెన్సీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు ఇచ్చింది. సీనియర్ రెసిడెన్సీ పోస్టుల నియామకాల్లో ప్రైవేట్ వైద్య కళాశాల విద్యార్థులను అనుమతించకపోవడంపై డాక్టర్ ఎం.ఝాన్సీరాణి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిగింది. పిటిషనర్ తరపున న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ కళాశాల్లో చదివిన వైద్యులను మాత్రమే అనుమతించడం డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనికి సంబంధించిన పత్రాలను న్యాయవాది కోర్టుకు అందించారు. ఆయన వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) నోటిఫికేషన్‌ను హైకోర్టు సోమవారం తాత్కాలికంగా నిలిపివేయగా, 24 గంటల వ్యవధిలో మరో ప్రభుత్వ నోటిఫికేషన్ సస్పెండ్ కావడం అధికారుల తొందరపాటు నిర్ణయాలకు నిదర్శనంగా పేర్కొనవచ్చు.

## ఇదీ లోకం!

# సడలని ఉక్కు సంకల్పం

- 600 రోజులకు విశాఖ ఉక్కు ఉద్యమం
- స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం: ఓబులేసు
- జీవీఎంసీ వద్ద భారీ ఆందోళన
- పెద్దఎత్తున ప్రజల భాగస్వామ్యం

2 లో

# అతివేగానికి 8 మంది బలి

బొలెరో వాహనాన్ని ఢీకొన్న లారీ

అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**విశాలాంధ్ర-చింతూరు:** అతివేగం ఎనిమిది మంది ప్రాణాలను బలిగొంది. బొలెరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఆరుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం బొడ్డుగూడెం వద్ద 30వ జాతీయ రహదారిపై తెలంగాణ రాష్ట్రం భద్రాచలం నుంచి చింతూరు వైపు వస్తున్న బొలెరో వాహనాన్ని మంగళవారం మధ్యాహ్నం ఐరన్ లోడుతో భద్రాచలం వెళుతున్న లారీ ఎదురుగా వచ్చి అతివేగంగా ఢీకొనడంతో బొలెరో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం, చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొండగన్ జిల్లా నుంచి బొలెరో వాహనంలో పదిమంది భద్రాచలం సీతారాముల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఐరన్ లారీ బొడ్డుగూడెం వద్ద ఎదురుగా వచ్చి ఢీకొనడంతో బొలెరోలో ఉన్న ఇద్దరు మహిళలు,

- మిగతా 2 లో

# సోలోమన్ దీవుల్లో భారీ భూకంపం

- పేకమేడల్లా కూలిన ఇళ్లు
- రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.3గా నమోదు
- సునామీ హెచ్చరికల జారీ-ఉపసంహరణ

వెల్లింగ్టన్: కొద్ది రోజులుగా ప్రకృతి ప్రకోపిస్తోంది. కుండపోత వర్షాలు, మెరుపు వరదలు, భూకంపాలు ప్రజలను అల్లాడిస్తున్నాయి. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తోంది. సోమవారం ఇండోనేసియాలో భారీ భూకంపం సంభవించి 160 మందికిపైగా మృత్యువాత పడ్డారు. దీని నుంచి కోలుకోక ముందే సోలోమన్ దీవుల్లో మంగళవారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. వారంతా ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొన్నిచోట్ల ఇళ్లు పేకమేడల్లా కూలిపోయాయి. కార్యాలయాల్లో ఉన్నవారు టేబుళ్ల కిందకు నక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. భవనాలు ఊగిపోయాయి. అయితే ఆస్తి-ప్రాణ నష్టంపై పూర్తి సమాచారం అందలేదు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైంది. భారీ భూకంపం వల్ల సముద్రంలో అలలు ఎగిసిపడటంతో సోలోమాన్ దీవుల్లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ముప్పు తొలగడంతో వాటిని అధికారులు ఉపసంహరించుకున్నారు. మలాంగోకు 17కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. 20 సెకన్లపాటు భూమి కంపించినట్లు చెప్పారు. సోలోమన్ దీవుల్లోని మలాంగోకు నైరుతి దిశగా భూకంప కేంద్రం ఉన్నట్లు యుఎస్ జియోలాజికల్ సర్వే అధికారులు తెలిపారు. మరిన్ని ప్రకంపనలకూ అవకాశమున్నట్లు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. హోనియారాకు నైరుతి దిశగా 56కిమీల దూరంలో 13కిమీల లోతులో సముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. ప్రభుత్వ అధికార ప్రతినిధి జార్జ్ హెర్మింగ్ మాట్లాడుతూ, రాజధాని హోనియారాలోగల భవనం రెండవ అంతస్తులో తన కార్యాలయం ఉన్నదని, భూకంపం వచ్చినప్పుడు అంతా ఊగిపోగా ఓ బల్ల కింద నక్కి కూర్చున్నానన్నారు.బలమైన ప్రకంపనలు సంభవించాయని చెప్పారు. టేబుళ్లు, కుర్చీలు, డెస్కులు, పుస్తకాలు అన్నీ అస్థవస్తంగా పడ్డాయన్నారు. కాగా, సోలోమన్ దీవుల్లో 7,00,000 మంది జనాభా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

చైనా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

## 38 మంది దుర్మరణం

బీజింగ్: సెంట్రల్ చైనాలోని వాణిజ్య సంస్థకు చెందిన కర్మాగారంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. 38 మంది దుర్మరణం చెందగా ఇద్దరి ఆచూకీ లేదని స్థానిక అధికారులు మంగళవారం తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక దళానికి నాలుగు గంటలకుపైగా పట్టినట్లు వెల్లడించారు. హన్సన్ ప్రావిన్స్‌లోని వెన్‌ఫెగ్ జిల్లా, అనియాంగ్ నగరంలో వాణిజ్య కంపెనీ కర్మాగారంలో సోమవారం రాత్రి 11 గంటలప్పుడు (స్థానిక కాలమానం ప్రకారం) మంటలు ఎగిసిపడ్డాయని నగర పబ్లిసిటీ విభాగం వెల్లడించింది. గాయపడిన మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. ప్రమాదానికిగల కారణాలు తెలియరాలేదని అధికారులు అన్నారు. అనుమానితులుగా భావించిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

విశాలాంధ్ర ప్రపంచం

## అమెరికా ఒత్తిడితోనే...

### ఉత్తర ఇరాక్, సిరియాలో టర్కీ వైమానిక దాడులపై కేకేఈ

ఏథేన్స్: ఉత్తర ఇరాక్, సిరియాలో టర్కీ వైమానిక దాడులను గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) తీవ్రస్థాయిలో ఖండించింది. అమెరికా ఒత్తిడికి తలొగ్గి తమ అధికారబలాన్ని ప్రదర్శించిందని ఒక ప్రకటనలో పేర్కొంది. -సిరియాలోని కుర్దిష్ ప్రాంతాలపై, ఉత్తర ఇరాక్‌పై వైమానిక దాడులకు తెగబడటం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. అమెరికా, యూరోపియన్ యూనియన్, రష్యావల్ల ఒత్తిడికి గురికావడం వల్లనే టర్కీ ఈ విధంగా దాడులకు పాల్పడుతోందని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితులు ప్రజలకు అత్యంత ప్రమాదకరమైనవిగా పరిణమిస్తున్నట్లు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటన వెల్లడించింది.

## 29న షెంజౌ-15 ప్రయోగానికి చైనా ఏర్పాట్లు

జియుక్వాన్: షెంజౌ-15 అంతరిక్ష నౌక ప్రయోగానికి చైనా చకాచకా ఏర్పాట్లు చేస్తోంది. లాంగ్ మార్చ్-2ఎఫ్ కెరియర్ రాకెట్‌ను సోమవారం ప్రయోగస్థలికి తరలించినట్లు చైనా మానవసహిత అంతరిక్ష సంస్థ (సీఎంఎస్) ప్రకటన వెల్లడించింది. ప్రయోగ కేంద్రం వద్ద అనుకూల పరిస్థితులు, వసతులు ఉన్నాయని తెలిపింది. ప్రయోగానికి ముందు అవసరమైన అనేక ప్రక్రియలను ఒకదాని తర్వాత ఒకటిగా నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అంతా అనుకున్నట్లుగానే జరిగితే వాయువ్య చైనాలోని జిన్‌గావ్ శాటిలైట్ ప్రయోగ కేంద్రం నుంచి షెంజౌ-15 ఈనెల 29న నింగిలోకి దూసుకెళ్లనున్నట్లు సీఎంఎస్ వెల్లడించింది.

## కేరళలో రోజువారీ వేతనం అధికం

(మొదటిపేజీ తరువాయి)

రోజువారీ వేతనం అత్యల్ప జీతాలు ఇస్తున్న రాష్ట్రాలయిన త్రిపుర, మధ్యప్రదేశ్ కంటే మూడు రెట్లు ఎక్కువ. త్రిపురలో రూ.250, మధ్యప్రదేశ్‌లో రూ.267, గుజరాత్‌లో రూ.296, మహారాష్ట్రలో రూ.362తో పోలిస్తే కేరళలో నిర్మాణ కార్మికుడు రోజుకు సగటున రూ.837.3 సంపాదించాడు' అని 2022-23 ఆర్థిక సంవత్సరం గణాంకాలను కేంద్ర బ్యాంకు సంకలనం చేసింది. దానికి సంబంధించి శనివారం కరదీపికను విడుదల చేశారు. ఇక జమ్మూకశ్మీర్‌లో ఒక నిర్మాణ కార్మికుడు సగటున రోజుకు రూ.519 సంపాదించాడు. సగటు రోజువారీ వేతనం రూ.500 కంటే ఎక్కువ ఉన్న ఏకైక ఇతర ప్రాంతం ఇదే కావడం విశేషం. అలాగే తమిళనాడులో రూ.478, హిమాచల్ ప్రదేశ్‌లో రూ.462, హరియాణాలో రూ.420 చెల్లిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ కార్మికులకు రోజువారీ వేతనం రూ.409గా ఉంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం... వ్యవసాయ, వ్యవసాయేతర విభాగాల విషయంలో కూడా కేరళ అగ్రస్థానంలో ఉంది. హిమాచల్ ప్రదేశ్ తర్వాత, మధ్యప్రదేశ్, గుజరాత్ తక్కువ చెల్లింపుదారులుగా ఉన్నాయి.

**పెట్టుబడుల ఆకర్షణలో గుజరాత్... మహారాష్ట్ర హవా**

పారిశ్రామిక రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించడంలో ముందున్నాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్ అత్యధికంగా రూ.72 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగా, మహారాష్ట్ర, తమిళనాడు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వివరాల ప్రకారం... 2020-21 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్ అత్యధిక స్థూల స్థిర మూలధన నిర్మాణం (జీఎఫ్‌సీఎఫ్) రూ.72,000 కోట్లకు పైగా నమోదు చేసింది. రూ.69,900 కోట్లతో మహారాష్ట్ర రెండవ స్థానంలో ఉండగా, రూ.45,900 కోట్లతో తమిళనాడు తర్వాతి స్థానంలో నిలిచింది. అయితే కర్ణాటక 27 వేల కోట్ల రూపాయలను నివేదించింది. కాగా 2020-21 నాటికి దేశం కోవిడ్ మహమ్మారి ప్రేరేపిత లాక్‌డౌన్‌కు చేరుకుంది. కానీ దాని ఆర్థిక ప్రభావంలో ఎక్కువ భాగం 2021-22 సంవత్సరంలో కనిపించింది. దేశంలో జీఎఫ్‌సీఎఫ్ క్షీణతను చవిచూసింది. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరంలో 47.8 ట్రిలియన్ల డాలర్లకు కోలుకుంది. ఇది గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నుంచి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం... 2020-21 సంవత్సరం స్థాయి కంటే కొంచెం మెరుగుపడింది. 2022 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి, కర్ణాటక, తమిళనాడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు 20 ట్రిలియన్ డాలర్లకు పైగా ఉన్నాయి. ప్రస్తుత ధరల ప్రకారం స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ) ని ఉటంకిస్తూ ఆర్‌బీఐ పేర్కొంది. మహారాష్ట్ర, గుజరాత్‌లకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేదు. కానీ అంతకు ముందు సంవత్సరంలో, మహారాష్ట్ర 27 ట్రిలియన్లకు పైగా ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. అయితే గుజరాత్ ఆర్థిక వ్యవస్థ 16 ట్రిలియన్లకు పైగా ఉండగా, అలాగే ఉత్తరప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ 18.6 ట్రిలియన్ డాలర్లకు పైగా ఉంది. 2020 ప్రారంభం నుంచి వరుసగా ఎదురవుతున్న అనేక ఎదురుదెబ్బలకు భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతమైన స్థితిస్థాపకతను ప్రదర్శించిందని, వృద్ధిలో రికవరీ వేగాన్ని కొనసాగిస్తూ స్థూల స్థిరత్వాన్ని కాపాడుకుందని భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తెలిపింది.

**ఏపీ, యూపీ, మహారాష్ట్రలో జనాభా అత్యధికం**

సంతులిత ప్రాంతీయ అభివృద్ధి, సమ్మిళిత వృద్ధి భారతదేశ అభివృద్ధి అజెండాలో రెండు కీలకాంశాలు అని పేర్కొంది. దేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలుగా యూపీ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బీహార్ నిలిచాయి. అత్యధిక జనసాంద్రత కలిగిన ప్రాంతాలుగా జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్), తర్వాతి స్థానంలో చండీగఢ్ ఉంది.

## అతివేగానికి 8 మంది బలి

(మొదటిపేజీ తరువాయి)

నలుగురు పురుషులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురిని ఏడుగురాళ్లపల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఇద్దరు మృతి చెందారు. తీవ్ర గాయాలైన దయానిష్, కార్తీక్‌లను మెరుగైన చికిత్సకు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చింతూరు ఎస్పీ మహేశ్వర్ రెడ్డి తన సిబ్బందితో చేరుకొని సహాయ సహకారాలు అందించారు. రోడ్డుపై ఉన్న వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. విషయం తెలుసుకున్న చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆసుపత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. తొలుత వాహనంలో ఇరుక్కుపోయిన ఇద్దరి మృతదేహాలను పోలీసుల సహాయంతో బయటకుతీశారు. మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జీ20కి ఉదయ్‌పూర్ ముస్తాబు

ఉదయ్‌పూర్: జీ20 శిఖరాగ్ర సదస్సు భారత్ అధ్యక్షతన మొదటిసారి జరగబోతోంది. ఇందులో భాగంగా షెర్పా సమావేశానికి రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ముస్తాబవుతోంది. భారతీయ సంస్కృతికి అద్దంపట్టే విధంగా కళలను రంగరించుకుంటోంది. గోడలకు పెయింట్లు వేయడం మొదలు వారసత్వ కట్టడాలకు విద్యుత్ దీపాలంకరణ వరకు అన్ని పనులు వేర్వేరు ప్రభుత్వ శాఖల పర్యవేక్షణలో చకాచకా జరుగుతున్నాయి. డిసెంబరు, 5,6,7 తేదీల్లో ఈ సమావేశం జరగనుంది. మేవారీ ఆతిథ్యం ద్వారా దేశానికే కాదు ప్రపంచానికి విశిష్టమైన ఉదాహరణగా ఉదయ్‌పూర్ నిలుస్తుందని కలెక్టర్ తారాచంద్ మీర్ అన్నారు. రోడ్ల సుందరీకరణ, మరమ్మతులు, కాలువలో పూడిక తీత, చారిత్రక కట్టడాల అలంకరణ వంటివన్నీ ఈ నెలాఖరుకు పూర్తి అవుతాయని అయనన్నారు. రాజస్థాన్‌తో పాటు భారతీయ సంస్కృతి-సంప్రదాయాలు విదేశీ ప్రతినిధులను కట్టిపడేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రాంతీయ పర్యాటక కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ శిఖా సక్సేనా అన్నారు. శిల్ప్‌గ్రామంలో గ్రామీణ జీవనం, ఆకట్టు కునే సాంస్కృతిక ప్రదర్శనలు, నోరూరించే రాజస్థానీ వంటకాలు ప్రధాన ఆకర్షణలు అని చెప్పారు.ప్రతినిధులకు జెడ్‌ప్లస్ భద్రత కల్పించనున్నట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. డిసెంబరు 7న ప్రతినిధులంతా రాజ్‌సమండ్‌లోని 15వ శతాబ్దం నాటి కుంభల్‌ఘర్ కోటలో పర్యటిస్తారని, అక్కడ నుంచి పాలీలోని రానక్‌పూర్ ఆలయానికి వెళతారని అధికారులు వెల్లడించారు.

# రక్షకులే భక్షకులు!

- 11 నిమిషాలకు ఒక మహిళ హత్య
- సొంతవారి చేతుల్లోనే బలి
- ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ ఆందోళన
- స్త్రీలపై హింస అంతానికి ఇదే సమయం: ప్రపంచ దేశాలకు పిలుపు

ఐరాస: ప్రపంచవ్యాప్తంగా మహిళలకు వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ అన్నారు. కట్టుకున్న భర్తలు, కన్నవారు, తోబుట్టువులే వారి ప్రాణాలు హరిస్తున్నారని, అన్ని దేశాలలో మానవహక్కుల ఉల్లంఘనల్లో ఎక్కువగా జరుగుతున్నది బాలికలు, మహిళలపై హింస, వేధింపులు, లైంగిక దాడులే అని చెప్పారు. ప్రతి 11 నిమిషాలకు ఒక బాలిక లేక మహిళ సొంతవారి చేతుల్లో ప్రాణాలు కోల్పోతోందంటే పరిస్థితులు ఎంత దారుణమో అర్థం చేసుకోవచ్చు అని గుటెర్రస్ ఆందోళన వ్యక్తంచేశారు. 2026 నాటికి మహిళల హక్కుల సంఘాలకు నిధులను 50శాతం మేర పెంచాలని అన్ని దేశాలకు పిలుపునిచ్చారు. ఏటా నవంబరు 25న మహిళలపై హింస అంతానికి అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకుంటున్న క్రమంలో గుటెర్రస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. కోవిడ్-19, అంతర్జాతీయ ఆర్థిక సమస్యల వల్ల మహిళలు, బాలికలపై మౌఖిక- భౌతిక దాడులు, లైంగిక వేధింపులు, హింస పేట్రేగినట్లు ఆయన నొక్కిచెప్పారు. ఆన్‌లైన్‌లోనూ విద్వేష వ్యాఖ్యలు, లైంగిక వేధింపులు, అసభ్య పదజాలం-చిత్రాలతో అశ్లీల వైఖరికి మహిళలు బాధితులు అవుతున్నారని తెలిపారు. సొంత కుటుంబ సభ్యులు రక్షకులుగా ఉండాల్సిందిపోయి భక్షకులుగా మారుతుండటం అత్యంత దారుణమన్నారు. సామాజిక-ఆర్థిక సుస్థిరాభివృద్ధిలో మహిళల ప్రాతినిధ్యం పరిమితంగా ఉండటానికి హేయమైన నేరాలే కారణమని చెప్పారు. కనీస హక్కులు, స్వేచ్ఛను నిరాకరిస్తూ మహిళలపై హింస-వివక్ష కొనసాగుతుండటం దారుణమని గుటెర్రస్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితి మారాలని, ఇందుకోసం ప్రభుత్వాలు నడుంబిగించాలని సూచించారు. మహిళలు, బాలికలపై హింస అంతానికి పరివర్తనాత్మక చర్యలకు ఇదే సమయమని సూచించారు. మహిళలపై హింస నేపథ్య ఘటనల పరిష్కారానికి ప్రత్యేక నిధి, జాతీయ స్థాయి కార్యక్రమాలు చేపట్టాలని, ఇటువంటి ప్రతి నిర్ణయంలో పౌర సంఘాలను భాగస్వాములు చేయాలని ప్రభుత్వాలకు ఆంటోనియో గుటెర్రస్ సూచించారు.

## నేరచట్రంలో ప్రజాప్రతినిధులు

(మొదటిపేజీ తరువాయి)

డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లితో కూడిన ధర్మాసనానికి సమర్పించారు. ఒక నివేదిక ప్రకారం... ఈ కేసును ఈ కోర్టు స్వాధీనం చేసుకున్నప్పటికీ, విచారణను వేగవంతం చేసేందుకు వివిధ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఈ కేసులలో 41 శాతం ఐదేళ్ల కంటే పాతవి అని కూడా హన్సారియా ఎత్తి చూపారు. ఐదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అత్యధికంగా (శాసనసభ్యులపై ఉన్న మొత్తం కేసుల్లో) ఒడిశాలో (71 శాతం), ఆ తర్వాతి స్థానాల్లో బీహార్ (69 శాతం), ఉత్తరప్రదేశ్ (52 శాతం) నమోదయ్యాయని వివరించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో ఈ కేసు చివరి విచారణలో హన్సారియా అభ్యర్థనపై సుప్రీం కోర్టు... ఎంపీలు, ఎమ్మెల్యేల పై ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న నేర కేసులకు సంబంధించి తీసుకున్న చర్యల పై అఫిడవిట్‌లు దాఖలు చేయాలని అన్ని హైకోర్టులను ఆదేశించింది. హైకోర్టుల స్పందనలను క్రోడీకరించి ప్రస్తుత నివేదికను రూపొందించారు. గత విచారణలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై నేర కేసులను విచారణ చేసే జ్యుడీషియల్ అధికారులకు ప్రత్యేకంగా ఈ కేసులను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేయడాన్ని పరిశీలించాలని హన్సారియా సుప్రీం కోర్టును కోరారు. ఇంకా, హన్సారియా అభ్యర్థన మేరకు, సుప్రీం కోర్టు 2021 ఆగస్టు 10 నాటి ఉత్తర్వులను సవరించింది. దీనికి ఎంపీలు, ఎమ్మెల్యేలను విచారణ చేయడంలో పాల్గొన్న ప్రత్యేక/సీబీఐ కోర్టుల జ్యుడీషియల్ అధికారుల బదిలీకి కోర్టు ముందస్తు అనుమతి అవసరం. సాధారణంగా (ఒక నిర్దిష్ట పోస్టింగ్‌లో అధికారి పదవీకాలం ముగియడం వల్ల) చేసే అటువంటి బదిలీలకు ముందస్తు అనుమతి అవసరం లేదని ఉన్నత న్యాయస్థానం సవరణ చేసింది. అయితే, పదవీకాలం ముగియడం వల్ల సాధారణంగా లేని అన్ని బదిలీలకు ముందస్తు అనుమతి అవసరం.

# సడలని ఉక్కు సంకల్పం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: త్యాగాల పునాదులపై ఆవిర్భవించిన విశాఖ ఉక్కును వ్యూహాత్మక అమ్మకం పేరుతో మోదీ సర్కారు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి నిర్ణయం తీసుకుంది. విశాఖ ఉక్కు ప్రజల ఊపిరి... ప్రజల సంపద...విశాఖ ప్రగతికి జీవనాడి...దీనిని విక్రయించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు మొదలుకొని...రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం సాగుతోంది. విశాఖజిల్లా కార్మిక, ప్రజాసంఘాల జేఏసీ అధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 600 రోజులు పూర్తయ్యాయి. ప్రభుత్వరంగ సంస్థలు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, భవననిర్మాణం, ఆటో, ముఠా, తోపుడుబండ్లు, రవాణా, ఆశ, అంగన్‌వాడీ, మిడ్డేమీల్, షాపులు, ఆసుపత్రులు, ఇంటిపనివారలతో పాటు మహిళలు, విద్యార్థులు, యువజనులు, మేధావులు, కవులు, కళాకారులు, న్యాయవాదులు, పెన్షనర్లు, అపార్టుమెంట్‌వాసులు, వికలాంగులు సహా అన్ని తరగతులు 'మేము సైతం' అంటూ ఉద్యమంలో పాల్గొన్నారు. అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఉక్కు కార్మికుల దీక్షలు 600 రోజులకు చేరుకున్నాయి. కరోనా సమయంలోనూ ఇల్లు దాటి ప్రజలు బయటకు రావలేని స్థితిలోనూ నిరాహార దీక్షలు కొనసాగాయి. అందరి సంకల్పం ఒక్కటే. స్టీల్‌ప్లాంటును, ప్రభుత్వరంగ సంస్థలను, ప్రజల ఆస్తిని, విశాఖ అభివృద్ధిని కాపాడుకోవడం...భావితరాలకు అందించడం. విశాఖ ఉక్కు కార్మికుల అకుంఠిత దీక్షతో దీక్షా శిబిరం కొనసాగడం చరిత్రలో నిలిచిపోతుది. మరోవైపు, నవంబరు 11,12 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ప్రజాభీష్టానికి ఆయన విలువ ఇస్తారని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నామని ప్రకటన చేస్తారని రాష్ట్ర ప్రజలంతా ఆతృతతో ఎదురుచూశారు. కానీ మోదీ నోట స్టీల్‌ప్లాంట్ మాటే రాలేదు. ప్రజాభీష్టానికి, విశాఖ అభివృద్ధికి పాతరేశారు. మోదీ ద్రోహానికి వ్యతిరేకంగా...శిబిరానికి 600 రోజులు పూర్తయిన సందర్భంగా నవంబరు 22ను బ్లాక్‌డేగా జరపాలని విశాఖ జిల్లా కార్మిక, ప్రజాసంఘాల జేఏసీ పిలుపు నిచ్చింది. దీంతో మంగళవారం వందలాది మంది నల్లదుస్తులతో శిబిరానికి చేరుకున్నారు. మోదీ ప్రభుత్వ ద్రోహాన్ని నిరసిస్తూ ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జేఏసీ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.నాగభూషణం, పడాల రమణ అధ్యక్షతన సభ జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ప్రసంగించారు.

ఓబులేసు మాట్లాడుతూ వేలాదిమంది రైతుల భూ దానంతో, 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తమవుతున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఇటీవల విశాఖ వచ్చిన మోదీ... స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రకటన చేస్తారని అంత భావించారని, అయితే ఆయన మాత్రం ఇటువంటి ప్రస్తావన చేయకుండా నిరాశపరిచారని విమర్శించారు. ప్రధాని సభలో ముఖ్యమంత్రి జగన్ ఈ విషయాన్ని ప్రస్తావించినా మోదీ మాట్లాడకపోవడం దారుణమన్నారు. లాభదాయక విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటీకరించే లక్ష్యంతో ఉద్దేశపూర్వకంగా దానిని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. దీనిని ఎదుర్కొంటామని తెలిపారు.

ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వై.మస్తానప్ప, దొమ్మేటి అప్పారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సీఎఫ్‌టీయూఐ జిల్లా కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, పీఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యూఎస్‌ఎన్ రాజు, పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, కళారంగం నాయకులు ఎం.చంటి, కె.నిర్మల, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కె.పెంటారావు, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కేఎం కుమార్ మంగళం, ట్రాన్స్‌పోర్టు యూనియన్ కార్యదర్శి జి.అప్పలరాజు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జే నాయుడు, బొట్టా ఈశ్వరమ్మ తదితరులు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు ఉత్సాహంగా పాటలు పాడారు.

**రహదారిపై ఆందోళన**

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నేతృత్వంలో మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. వందలాది మంది కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు దీక్షలో పాల్గొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వబోమంటూ స్పష్టంచేశారు. నల్ల జెండాలతో నిరసన తెలియజేస్తూ జీవీఎంసీ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించింది. 'ఎవడురా అమ్మేది, ఎవడురా కొనేది', 'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి'. ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి', 'ప్రధాని మోదీ మొండి వైఖరి నశించాలి, 'ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని కాపాడుకుంటాం' అంటూ నినాదాలు చేశారు.

## 'స్పెర్మ్' దందా...!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నప్పటికీ ఉన్నతాధికారులు మౌనం దాల్చడం అనుమానాలకు తావిస్తోంది.

**బిల్లులు లేకుండా మందుల విక్రయం**

పశువైద్యశాలల్లో సాధారణ మందులతోపాటు స్పెర్మ్ ఇంజక్షన్లను ఉచితంగా పంపిణీ చేయకుండా వివిధ ఏజెన్సీలు, ప్రైవేట్ మందుల షాపులకు కొందరు వైద్యులు సిఫార్సు చేస్తూ, అక్కడే కొనుగోలు చేయాలన్న నిబంధన విధిస్తున్నారు. గుంటూరు, విజయవాడ, మంగళగిరి తదితర ప్రాంతాల్లో నడుస్తున్న ప్రైవేట్ మెడికల్ షాపుల్లో బిల్లులు లేకుండా మందుల విక్రయాలు కొనసాగుతున్నాయి. జిల్లాల్లో పశువైద్యశాల శాఖ సంచాలకులకు మందుల పంపిణీ, నిర్వహణపై పూర్తి అధికారం ఉంటుంది. దీనిని ఆసరాగా తీసుకుని నిర్దేశించిన ప్రైవేట్ మందుల షాపుల్లోనే కొనుగోలు చేయాలంటూ కొందరు అధికారులు నిబంధన విధించి, పరోక్షంగా సంబంధిత ఏజెన్సీలు, మందుల షాపుల యాజమాన్యంతో ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నట్లు విమర్శలున్నాయి. దీంతో ప్రభుత్వపరంగా ఉచితంగా ఇవ్వాల్సిన మందుల్లో 60 నుంచి 70శాతం పక్కదారి పడుతున్నట్లు ప్రచారముంది. వైద్య నిపుణులు సూచించిన మందులు కాకుండా ఎక్కువ కమీషన్ వచ్చే కంపెనీల మందులకే ప్రాధాన్యత ఇవ్వడం, వారు సూచించిన బ్రాండ్ మందులనే కొనుగోలు చేయాలన్న నిబంధనతో పశువుల యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారు. రాజధాని ప్రాంతానికి చెందిన ఓ మెడికల్ ఏజెన్సీ ప్రతి రోజూ భారీగా మందులు విక్రయిస్తున్నప్పటికీ...కేవలం రూ.9వేలకే బిల్లు చేస్తూ, జీఎస్టీని ఎగవేత వేస్తోంది. ఇదేతరహాలో వివిధ ప్రాంతాల్లో బినామీ పేర్లతో మెడికల్ షాపుల నిర్వాహకులు దందా నడుపుతున్నప్పటికీ జగన్ ప్రభుత్వం చోద్యం చూస్తోంది.

**స్పెర్మ్ బ్యాంకులపై తనిఖీలేవీ?:** జిల్లాకు ఒకటి చొప్పున స్పెర్మ్ బ్యాంకులు పశు సంవర్ధకశాఖ అధ్వర్యంలో నడుస్తున్నాయి. వాటిని జిల్లా కేంద్రంలో గానీ, లేక అనువైన ప్రాంతంలోగానీ ఏర్పాటు చేస్తారు. వాటిపై అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికీ ఇంతవరకు తనిఖీలకు ప్రభుత్వం ఆదేశించలేదు. నిబంధనల ప్రకారం ఈ బ్యాంకుల ద్వారా స్పెర్మ్ ఇంజక్షన్లను ఉచితంగా సరఫరా చేయాల్సి ఉండగా, ప్రతి ఇంజక్షన్‌ను రూ.2వేల నుంచి రూ.5వేలకు విక్రయిస్తున్నారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న గోపాలమిత్ర పథకం సిబ్బందితో కుమ్మక్కై డిమాండ్ గల ఒంగోలు తదితర జాతి స్పెర్మ్ ఇంజక్షన్లను బ్లాక్ చేస్తున్నట్లు తెలిసింది. తిరుపతి, విశాఖ ప్రాంతాల నుంచి అన్ని జిల్లాల బ్యాంకులకు స్పెర్మ్ సరఫరా చేస్తున్నారు. పశు వైద్యశాలలు, కార్యాలయాల్లో రోజువారీ మందుల వివరాలు ప్రదర్శించాలంటూ హైకోర్టు చెప్పినా అధికారులు బేఖాతరు చేస్తున్నారు. రాజధాని ప్రాంతానికి చెందిన ఓ అధికారి భారీగా అవినీతి దందాకు పాల్పడినట్లు, ఇటీవల రూ.2కోట్లతో నూతన ఇంటిని కొనుగోలు చేసినట్లు ప్రచారముంది. మరో అధికారి సైతం రూ.6కోట్లతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అధికార నేతలతో ఫొటోలు దిగి, పరోక్షంగా తమ మద్దతు ఉందనేలా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఆయన అవినీతి రాజ్యంపై ఏసీబీ, విజిలెన్స్‌తో దాడులకు ప్రభుత్వం ఆదేశిస్తే...వాస్తవాలు వెల్లడవుతాయి.

**మందుల అవినీతిపై దశల వారీ పోరాటం: ఏఐవైఎఫ్**

పశువైద్యశాలల్లో నెలకొన్న అవినీతిని అరికట్టేందుకుగాను ఏసీబీ, విజిలెన్స్ సంస్థలతో సమగ్ర విచారణకు ఆదేశించేలా ఏఐవైఎఫ్-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి దశల వారీ పోరాటాలకు సన్నద్ధమైంది. రాబోయే రోజుల్లో ఏసీబీ, విజిలెన్స్ అధికారులను కలుస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, ఎన్.లెనిన్‌బాబు తెలిపారు. పశువైద్యశాలల్లో అవినీతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదన్నారు.

## మళ్లీ మొక్కుబడేనా ?

(మొదటిపేజీ తరువాయి)

రాసింది. విచిత్రమేమిటంటే 2016 సెప్టెంబరు వరకు మాత్రమే ఏపీ పెండింగ్ అంశాల జాబితా తమ వద్ద ఉన్నట్లు సీఎస్‌కు పంపిన లేఖలో కేంద్రం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా, వైద్య సంస్థలు, పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోన్, ప్రత్యేక హోదా, అమరావతి రాజధానిని హైదరాబాద్‌కు అనుసంధానం చేయడం, కొత్త రాజధానికి ఆర్థిక సహకారం, మౌలిక సదుపాయాలు, కడప ఉక్కు, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వంటి వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన 34 పెండింగ్ అంశాలను కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్‌లో పెట్టింది. వీటిలో అమలైనవి, అమలు కావల్సిన అంశాలతో అప్‌డేట్ చేయాలని సీఎస్‌కు సూచించింది. ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన వల్ల దీనిపై కదలిక వచ్చిందో, లేదంటే పదేళ్లలో విభజన అంశాల అమలు గడువు ముగుస్తుండటమో...కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ సహజంగానే సమీక్షిస్తుందో తెలియదు కానీ...ఈ సమావేశంలోనైనా పెండింగ్ విభజన అంశాలకు మోక్షం కలుగుతుందని రాష్ట్ర ప్రజలు ఆశపడుతున్నారు. వాస్తవానికి విభజన అంశాలన్నీ పదేళ్లలో అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఎనిమిదిన్నర సంవత్సరాలు పూర్తయినా ఏ ఒక్క అంశం పూర్తిస్థాయిలో అమలు కాలేదు. కొన్ని ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఇక ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, భావనపాడు పోర్టు, మెట్రో రైలు ప్రాజెక్టు, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు వంటి అంశాలనైతే అసలు పట్టించుకోవడం లేదు. కేంద్ర విద్యా, వైద్య సంస్థలు ఏ ఒక్కటీ నిర్మాణాలు పూర్తి చేసుకోలేదు. అభివృద్ధిలో వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు కేవలం రూ.1050 కోట్లు మూడుసార్లుగా నిధులు విదిల్చి సరిపెట్టారు. రెవెన్యూలోటు ఊసెత్తడం లేదు. పోలవరం ప్రాజెక్టు నిధుల మంజూరుకు అనేక కొర్రీలు పెడుతూ ముప్పుతిప్పలు పెడుతున్నారు. 9,10 షెడ్యూళ్లలోని సంస్థలకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అమరావతి రాజధాని నిర్మాణానికి సహకరించకపోగా, రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తున్న సమస్యను కేంద్రం జఠిలం చేస్తోంది. విభజన అంశాలకు సంబంధించి ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాని నేపథ్యంలో ఈనెల 23న కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ నిర్వహిస్తున్న సమావేశం మొక్కుబడిలా కాకుండా, కనీసం ముఖ్య అంశాలకైనా మోక్షం కల్గించాలని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారు.

## 26న ధర్నా జయప్రదం చేయండి

### ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-తాడేపల్లి: రైతుకు గిట్టుబాటు ధర, రుణ విముక్తి కల్పించాలనీ, విద్యుత్తు మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాలో రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అన్ని పంటలకు మద్దతు ధర చట్టాలు చేయాలని, రైతు రుణాల రద్దు, భూ సర్వేలో తప్పులు సరిచేయాలని, గ్రామ సభలు విధిగా నిర్వహించాలని, వరదలకు నష్ట పోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధర్నా జరుగుతుందని చెప్పారు.

# పట్టాలిచ్చే వరకు పోరు

- రుద్రాక్ష గుట్ట బహిరంగ సభలో రామకృష్ణ
- సీపీఐ భారీ ర్యాలీ

విశాలాంధ్ర - డోన్: నంద్యాలజిల్లా రుద్రాక్ష గుట్ట బాధితులకు పట్టాలు పంపిణీ చేసేంతవరకు పోరాడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఉద్ఘాటించారు. రుద్రాక్ష గుట్ట బాధితులకు ఎర్రజెండా అండగా నిలుస్తుందని చెప్పారు. పేదలకు పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రామకృష్ణ మంగళవారం డోన్ పట్టణంలోని రుద్రాక్ష బాధితుల కోసం సీపీఐ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. రుద్రాక్ష గుట్టలో పేదల ఇళ్లను తొలగించిన స్థలాలను పరిశీలించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ, రుద్రాక్షగుట్టలోని పేదలకు పట్టాల కోసం 15ఏళ్లుగా సీపీఐ పోరాడుతోందని గుర్తు చేశారు. 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తామని డోన్ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గతంలో చెప్పారని, ఇప్పుడు ఆసుపత్రితో పాటు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వేసిన పునాదులు తొలగించారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. పేదలు ఇళ్లు నిర్మించుకుంటే అడ్డుపడ్డ అటవీ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తుంటే ఏం చేస్తున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. పేదలకు ఒక చట్టం అధికార పార్టీకీ మరొక చట్టమా అని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయానికి స్థలాలు కావాలంటే పట్టణ సమీపంలో మంత్రి అనుచరులు కబ్జా చేసిన వందల ఎకరాలు ఉన్నాయన్నారు. పేదల సమస్య పరిష్కారం కాకపోతే బుగ్గనపై ఎర్రజెండా పోరు జరుగుతుందని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు పేదలకు పట్టాలు, ఇల్లు నిర్మించని పక్షంలో ఆమరణ దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, పి.సుంకయ్య, ఎం.నబి రసూల్, లెనిన్ బాబు, బాబా ఫక్రుద్దీన్, నారాయణ పాల్గొన్నారు.

# సమస్యలపై పోరాటానికి సన్నద్ధం

### పార్టీ కార్యకర్తలకు జేవీఎస్ఎన్ మూర్తి పిలుపు

విశాలాంధ్ర - అనకాపల్లి: సమస్యలపై పోరాటానికి సీపీఐ కార్య కర్తలు సన్నద్ధం కావాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్య నారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక న్యూ కాలనీలోని రోటరీ కళ్యాణ మండపంలో సీపీఐ అనకాపల్లి జిల్లాస్థాయి జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఊసే లేదన్నారు. నల్లధనం వెనక్కి రాలేదు సరి కదా 99శాతం నల్లధనం తెల్ల ధనంగా మారిందన్నారు. జీఎస్టీ వల్ల అసంఘటిత రంగం పూర్తిగా దెబ్బతిన్నదనీ, రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మకానికి పెట్టారని విమర్శించారు. మోదీ వచ్చిన తర్వాత పరువు హత్యలు ఎక్కువయ్యా యనీ, భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ, బీజేపీ మతోన్మాదంతో దేశాన్ని పరిపాలిం చాలని చూస్తోందని అన్నారు. ఈ పార్టీని గద్దె దించాలంటే వామపక్ష,ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఏకం కావాలని కోరారు. వేదికపై పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, రామానాయుడు ఆశీనులయ్యారు. సమావేశానికి అనకా పల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబాబు, సన్యాసిరావు, సుబ్బలక్ష్మి, అప్పలరాజు, మండల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేడు 'వైఎస్సార్ జగనన్న' భూపత్రాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష (రీసర్వే) పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభిస్తారు. ఇందుకోసం ఆయన బుధవారం ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఉ.11గంటలకు నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకొంటారు. అక్కడ నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడతారు. లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తారు. ఆపై మధ్యాహ్నం 1.25 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 3.25 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. వందేళ్ల తర్వాత తొలిసారిగా దేశంలో చేపట్టిన సమగ్ర భూ రీసర్వేలో భాగంగా రెండువేల గ్రామాల రైతులకు జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ జరగనుంది. మరో 15 రోజుల్లో రెండువేల గ్రామాల సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. దశలవారీగా రాష్ట్రంలోని భూముల రీసర్వే గ్రామాల్లో అవసరమైన ప్రక్రియను పూర్తిచేసి సచివాలయాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తారు. రాష్ట్రప్రభుత్వం 2020 డిసెంబర్ 21న వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకాన్ని ప్రారంభించింది. రెండువేల గ్రామాల్లో రీసర్వే సమయంలో రైతులు దరఖాస్తు చేసుకోకుండా 8-9 నెలలలో 4.3 లక్షల సబ్‌డివిజన్లు, 2 లక్షల మ్యుటేషన్లు భూమి, రెవెన్యూ రికార్డుల్లో జరిగాయి. మీసేవ, గ్రామ సచివాలయాల ద్వారా ఏటా స్వీకరించిన 35వేల సబ్‌డివిజన్ దరఖాస్తులతో దీనిని పోల్చవచ్చు. భూ రికార్డుల ప్రక్షాళణ, భూ కమతం ఒక సర్వే నంబర్ కింద ఉండి, కాలక్రమేణా విభజన జరిగి చేతులు మారినా సర్వే రికార్డులు అప్‌డేట్ కాక భూ వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితికి చెల్లుచీటీలా ఈ కార్యక్రమానికి జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి భూ కమతానికి విడిగా అక్షాంశ, రేఖాంశాలు, విశిష్ట గుర్తింపు సంఖ్య, సమగ్రంగా భూ వివరాలు తెలిపే క్యూఆర్ కోడ్‌తో కూడిన భూ కమత పటం భూ యజమానులకు జారీ చేస్తుంది. గ్రామ స్థాయిలో భూ రికార్డులన్నీ క్రోడీకరించి, భూ కమతాలతో కూడిన గ్రామ పటం, ఇతర భూ రికార్డులు ఇక గ్రామాల్లోనే అందుబాటులో ఉంచుతారు.

## పేదరికంపై యుద్ధానికే నవరత్నాలు: చెల్లుబోయిన

### బీసీల సంక్షేమానికి రూ. లక్షా 40 వేల కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదరికంపై యుద్ధం చేయడానికి సీఎం జగన్ అందించిన తొమ్మిది ఆయుధాలే నవరత్నాలు అని బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం 56 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి అంటే పేదవాడిని ఉన్నత స్థితికి తీసుకురావడమేనని అన్నారు. సంక్షేమ పథకాల అమలుపై అవగాహన సదస్సుల నిర్వహణకు ప్రతి కార్పొరేషన్‌కు రూ.2 లక్షల చొప్పున నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీచేసిందన్నారు. అర్హులను గుర్తించి వారికి పథకాలు వర్తించేలా కృషి చేయాల్సిన బాధ్యత కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లపై ఉందన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదు, బ్యాక్ బోన్... అంటూ కొత్త నిర్వచనం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం చారిత్రక నిర్ణయమని మంత్రి కొనియాడారు. బీసీల అభ్యున్నతి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నవరత్నాలు, వివిధ సంక్షేమ పథకాలకు దాదాపు లక్షా 40 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత, నవరత్నాల కార్యక్రమాల వైస్ చైర్మన్ నారాయణమూర్తి, బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.విజయలక్ష్మీ, డైరెక్టర్ పి.అర్జున రావు, బీసీ కార్పొరేషన్ల సమన్వయకర్త ఏ ప్రవీణ్, పర్సన్ ఇన్‌చార్జ్‌లు కె. మల్లికార్జున, ఏ.కృష్ణమోహన్, డి.చంద్రశేఖర్ రాజు, పి. మాధవీలత, ఎస్.తనూజ, జి.ఉమాదేవి, ఎం.చినబాబు, బీమ్ శంకర్ పాల్గొన్నారు.

## జరబన సేవలు చిరస్మరణీయం

### ప్రథమ వర్ధంతి సభలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు వనజ

నందిగామ టౌన్/రూరల్: విద్యార్థి దశ నుంచే ప్రజాసమస్యల పరిష్కారానికి అహరహం శ్రమించిన జరబన నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. నందిగామ నియోజకవర్గంలో సీపీఐ అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకుడు జరబన నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభ మంగళవారం నందిగామలో జరిగింది. ఆమెతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు చలసాని వెంకట రామారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర తదితరులు జరబన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అమరజీవి సూర్యదేవర నాగేశ్వరరావు అడుగు జాడల్లో నడుస్తూ ఈ ప్రాంతంలో సీపీఐ పటిష్టతకు, ప్రజాసమస్యల పరిష్కారానికి జరబన నాగేశ్వరరావు ఏనలేని సేవలు చేశారని వనజ చెప్పారు పార్టీ అభివృద్ధికి జరబన నాగేశ్వరావు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ జరబన నాగేశ్వరావుతో సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఎంత ఒత్తుడులు వచ్చిన వెనకడుగు వేయని వ్యక్తిగా జరబన నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నందిగామ నియోజక వర్గ కార్యదర్శి చుండూరి సుబ్బారావు, సహాయ కార్యదర్శి కట్టా చామంతి, పట్టణ కార్యదర్శి హను మంతరావు (అంజి), నాయకులు వీరయ్య, రాజు జరబన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు దోపిడీ చర్య

### బిందు సేద్యం పరికరాలకు జీఎస్టీపై టి.లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సాగు పరికరాలపై జీఎస్టీ విధించడం రైతులను దోపిడీ చేసే చర్య అని సామాజిక ఉద్యమకారుడు టి.లక్ష్మీనారాయణ విమర్శించారు. బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్)లో వినియోగించే స్ప్రింక్లర్లు, ఇతర పరికరాలపై 12శాతం జీఎస్టీ భారం రైతులపై మోపడం గర్హనీయమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీటిని ఆదాచేసే లక్ష్యంతో, నీటి కొరత ఉన్న మెట్ట ప్రాంతాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించడానికి సబ్సిడీలు ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారేగానీ వాటిని సక్రమంగా చెల్లించడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి చేసి జీఎస్టీని రద్దు చేయించాలి లేదా ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

## లేపాక్షిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: రోజా

విశాలాంధ్ర-లేపాక్షి: సంస్కృతి, సాంప్రదాయా లకు పేరుగాంచిన భారత దేశంలో దక్షిణాన ఉన్న లేపాక్షి దేవాలయం అత్యంత శిల్పకళా వైభవంతో అలరారుతోం దని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా లేపాక్షి దుర్గా వీరభద్ర దేవాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. తొలుత ఆలయ అర్చకులు నరసింహా శర్మ, శ్రీనివాసులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. దుర్గా వీరభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, లేపాక్షి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేవాలయానికి ఇనెస్కో గుర్తింపు కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. ఆలయ అభివృది విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక స్థానం కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు. లేపాక్షి ఉత్సవాలు ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు చేపడతా మన్నారు. తొలుత ఎంపీ గోరంట్ల మాధవ్, జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, పర్యాటకశాఖ సీఈఈ మూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మలిరెడ్డి ఈశ్వరయ్య, చంద్రమౌళి రెడ్డిలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. నారా యణ స్వామి, బాణాల శ్రీనివాసరెడ్డి, అంజన్ రెడ్డి, ఆదినారాయణ, అశ్విత నారాయణ ,లక్ష్మణరావు, పురావస్తు శాఖ డీఈ వీరాంజ నేయులు, సీఏ బాలకృష్ణారెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున రెడ్డి, ఈవో నరసింహ మూర్తి, రూరల్ సీఐ వేణుగోపాల్, చిలమత్తూరు ఎస్సై శ్రీనివాసులు, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి కార్మికులంటే అంత నిర్లక్ష్యమా?

- జీవోల ప్రకారం జీతాలు చెల్లించకపోతే ఉధృత పోరాటం
- ఏఐటీయూసీ నాయకులు పూదోట ప్రకాష్, బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్ : ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన కాంట్రాక్టు పారిశుద్ధ్య, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు వేతనాలు పెంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవోలు ఇచ్చినా జీతాలు పెంచకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ విమర్శించారు. ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న దశలవారీ పోరాటాల్లో భాగంగా మంగళవారం ఉదయం విజయనగరం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఘోషా ఆసుపత్రి వద్ద గంట పాటు పనులు నిలుపుదల చేసి నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి పూదోట ప్రకాష్, బుగత అశోక్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు ప్రభుత్వం జారీ చేసిన 549 జీవో ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు రూ.16 వేలు, సెక్యూరిటీ గార్డులకు జీవో నంబరు 43 ప్రకారం జోన్ 1 వారికి రూ.11,912, జోన్ 2 వారికి రూ.11162, జోన్ 3 కార్మికులకు రూ.10,912 జీతాలు ప్రకటించి ప్రభుత్వం ఒక ప్రైవేటు కాంట్రాక్టరు చేతిలో పెట్టడం దారుణమన్నారు. కాంట్రాక్టరు చేతిలోకి వెళ్లిన తర్వాత పెరిగిన వేతనాలను ప్రతినెలా సక్రమంగా చెల్లించడం లేదని తెలిపారు. దీంతో పాలకులు పెంచుతున్న ధరల భారాలను తట్టుకోలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టరు మారిన తర్వాత 17 నెలల నుంచి పీఎఫ్ ఎంత జమ అవుతుందో, ఈఎస్ఐ ఎంత కటింగ్ చేస్తున్నారో ఇంతవరకు పే స్లిప్పుల ద్వారా తెలియ జేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఆసు పత్రిలో సరిపడా కార్మికులను నియమించకుండా కాంట్రాక్టరు కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని మండి పడ్డారు. ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ అప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 549 ప్రకారం జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టరు కార్మికులందర్నీ మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కూడా ఇల్లు, పిల్లలను వదిలి ప్రాణాలు పణంగా పెట్టి, కరోనా రోగులకు సేవ చేసి కార్మికులందరూ కరోనా బారిన పడినప్పటికీ, వారిపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ అప్కాస్‌లో చేర్చి ప్రతి నెలా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఏఐటీయూసీ అధ్వర్యంలో ఉద్యమం ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఘోషా ఆసుపత్రి పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు పాల్గొన్నారు.

## వణుకుతున్న తీరం

### దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం స్థిరంగా కొనసాగుతుండడంతో సముద్ర తీర ప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొంది. వాయువ్య దిశగా గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో కదులుతూ చెన్నైకు 140, నెల్లూరుకు తూర్పు ఆగ్నేయంగా 225 కిలోమీటర్ల దూరంలో కొనసాగుతోంది. ఇది తీరానికి సమీపించే కొద్దీ బలహీనపడి అల్పపీడనంగా మారుతుందని, దీని ప్రభావంతో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. చెన్నై-నెల్లూరు మధ్య తీరం దాటే అవకాశం ఉందని, బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. వాయుగుండం చెన్నైయ్ దగ్గర కేంద్రీకృతం కావడంతో కోట, వాకాడు మండలాల తీరంలో అలల ఉధృతి పెరుగుతోంది. కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, వావిళ్లదొరువు, యమదిన్నెపాళెం, తూపిలిపాళెం, శ్రీనివాసపురం, నవాబు పేట, కొండూరుపాళెం, వైట్‌కుప్పం, ఓడపాళెం తీరంలో సముద్రం ముందుకు వస్తోంది. తీరం వెంబడి జల్లులు కురుస్తుండటంతో ప్రజలంతా చలితో వణికిపోతున్నారు. తీర ప్రాంతాల్లో అధికారులు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## సమాజహితమే లక్ష్యంగా పని చేయాలి

### సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో విద్యార్థులతో ఇస్రో ఛైర్మన్

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రతి విద్యార్థి సమాజ హితమే లక్ష్యంగా తమ విద్యను వినియోగించాలని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం సత్యసాయి యూనివర్సిటీ 41వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యసాయి 97వ జయంతి ఉత్సవాలలో భాగంగా ప్రశాంతి నిలయం లోని సాయి కుల్వంత్ హాలులో స్నాతకోత్సవం జరిగింది. విద్యార్థులు కవాత్తు చేస్తూ సభావేదికకు చేరుకున్నారు. సోమనాథ్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో, అంతరిక్ష రంగంలో అభివృద్ధికి చెందిన దేశాలతో భారత్ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు. దేశీయంగా క్షిపణులు, ఉపగ్రహాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి విలువలు సామాజిక బాధ్యత ఆధ్యాత్మికతను కలగలిపిన విద్యను అందించేలా విద్యాలయాలను నెలకొల్పాలన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్న సత్యసాయి విద్యాసంస్థల కృషి అభినందనీయమని, క్రమశిక్షణకూ ఈ విద్యాసంస్థల్లో కొదవ లేదని ప్రశంసించారు. అనంతరం ప్రతిభావంతులైన 22 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 17 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 486 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి, శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ట్రస్టు సభ్యులు నాగానంద, డాక్టర్ మోహన్, యూనివర్సిటీ ఆచార్యులు పాల్గొన్నారు.

## పోలీసు క్రీడా విజేతలకు డీజీపీ అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దక్షిణ భారతదేశం నుంచి జాతీయ స్థాయి లాన్ టెన్నిస్, కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ క్రీడాకారులను డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం క్రీడా విజేతలను ఆయన అభినందించి, నగదు బహుమతి అందజేశారు. నవంబరు-15 నుంచి 18వకు ఢిల్లీలోని ఆర్కే కన్నా స్టేడియం సీఆర్పీఎఫ్ అధ్వర్యంలో 23వ ఆలిండియా పోలీస్ లాన్ టెన్నిస్ పోటీలు జరిగాయి. 125 మంది క్రీడకారులు పోటీల్లో పాల్గొన్నారు. డీఎస్పీ ఎన్‌టీవీ రాంకుమార్ సింగిల్స్ విభాగంలో బంగారు పతకం సాధించారు. డబుల్స్ విభాగంలో అడిషనల్ ఎస్పీలు సత్యనారాయణ, కోటేశ్వరరావు వెండి పతకాలు చేజిక్కించుకున్నారు. నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు మహారాష్ట్ర పోలీస్ అధ్వర్యంలో పూణేలో నిర్వహించిన 71వ ఆల్ ఇండియా కుస్తీ పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ బి.నూకరాజు రజతం సాధించారు. ఐజీ ఎల్‌కేవీ రంగారావు, క్రీడల విభాగం అధికారి కేవీ ప్రేమ్‌జిత్ పాల్గొన్నారు.

**మహిళలకు రక్షణ కవచం 'దిశయాప్'**

మహిళలకు రక్షణ కవచంలా దిశా యాప్ నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ తెలిపింది. దిశ అప్లికేషన్‌తో రాష్ట్రం చరిత్ర సృష్టిస్తోందని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనతో తెలిపారు. జగన్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దిశయాప్‌పై ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్ర తీరం వద్ద అర్ధరాత్రి ఒంటరిగా ఉన్న మహిళ వద్దకు చేరుకున్న గుర్తు తెలియని వ్యక్తి మాయమాటలతో మాయచేసి సమీపంలోని రిసార్ట్‌కు తీసుకెళ్లారని, అతను మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, లెంగికవేధింపులకు గురిచేయగా ఆమె మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నదని డీజీపీ తెలిపారు. ముగ్గురు మృగాళ్లు దాడి చేస్తూ, హింసిస్తుండగా అత్యంత విపత్కర పరిస్థితులో దిశ యాప్ ఆమెకు గుర్తుకొచ్చిందన్నారు. తన ఫోన్‌లో ఉన్న దిశ యాప్‌లోని బటన్ నొక్కి పోలీసులకు సమాచారం అందించిందని, అర్ధరాత్రి 1.19 గంటల సమయంలో కావలి రూరల్ పోలీసులు బాధితురాలి వద్దకు చేరుకున్నారని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దిశ యాప్ వల్ల ఇలాంటి ప్రయోజనలు ఉన్నాయని ఆయన వివరించారు.

## డిసెంబరులో అనంత-శ్రీకాకుళం పాదయాత్ర

### కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శైలజానాథ్

విశాలాంధ్ర-గుంటూరు : భారత్‌జోడో యాత్ర స్ఫూర్తితో డిసెంబరులో అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు పాదయాత్ర చేపట్టనున్నామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శైలజానాథ్ తెలిపారు.గుంటూరులోని రాజీవ్‌గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ, జిల్లాలు, నగరాల ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు లేవన్నారు. అమరావతిని రాజధానిగా ప్రక టించినప్పుడు మద్దతిచ్చి ఇప్పుడు మాట మార్చడం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజధాని కోసం రైతుల పాదయాత్రను అడ్డుకోవడం హేయమైన చర్య అని శైలజానాథ్ విమర్శించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, నాయకులు నూతలపాటి రవికాంత్, రామచంద్రారెడ్డి, జి.అలెగ్జాండర్ సుధాకర్, ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.

సంపాదకీయం

# చిత్తశుద్ధి లేని ప్రజాస్వామ్యం

అన్య మనస్సుతో త్రికరణశుద్ధిలేకుండా చేసే పని ఏదైనా ఫలించదు. పైగా ఒక్కొక్కసారి వికటించే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి లేదా సంస్థ, ఒక రాజకీయ పార్టీకైనా ఈ సూత్రం వర్తిస్తుంది. కాంగ్రెస్‌కు ఇది బాగా వర్తిస్తుంది. సోనియాగాంధీ నాయకత్వంలో పనిచేస్తున్న కాంగ్రెస్‌లో చిత్తశుద్ధి లేని ప్రజాస్వామ్యం కొనసాగుతోందని తాజాగా మరోసారి రుజువైంది. వారసత్వ రాజకీయాలను అనుసరిస్తున్న కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం లేదని, సమస్త వ్యవహారాలు సోనియాగాంధీ కనుసన్నల్లోనే నడుస్తున్నాయన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వాన్ని సైతం సోనియా వెనుక నుంచి నడిపించారని విమర్శలూ ఉన్నాయి. సంస్థాగత ఎన్నికలు జరపకుండా సోనియానే కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగడంపై అన్ని రాజకీయ పార్టీలు దాడి చేస్తున్నాయి. అధ్యక్ష ఎన్నికలు జరపాలని సుదీర్ఘ కాలంగా ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నా ఎట్టకేలకు అక్టోబరులో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో కర్ణాటకకు చెందిన మపన్న మల్లిఖార్జున ఖడ్గే గెలుపొంది పార్టీ అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరించారు. 80 ఏళ్ల కురువృద్ధుడైన ఖడ్గేతో పాటు పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అధ్యక్ష పదవికి పోటీ చేయాలని రంగంలోకి దిగారు. అలా ప్రయత్నించిన వారిలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్, కేరళకు చెందిన శశిథరూర్ ఉన్నారు. గెహ్లాత్ ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా ఉండాలని ఆశించారు. ఆయన గాంధీ కుటుంబానికి ఇష్టుడే అయినా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయమని కోరగానే తిరుగుబాటు చేశారు. గెహ్లాత్ క్షమాపణ కోరడంతో కాంగ్రెస్ సంక్షోభంలో పడే పరిస్థితులు తప్పిపోయాయి. గెహ్లాత్ పోటీ నుంచి తప్పుకున్నారు. అలాగే దిగ్విజయ్‌సింగ్ పోటీ చేయాలన్న తలంపును విరమించుకున్నారు. శశిథరూర్ పోటీలో ఉన్నారు. 24 ఏళ్ల తర్వాత అధ్యక్ష ఎన్నికలు జరగడం, గాంధీ కుటుంబయేతర వ్యక్తి ఎన్నిక కావడం చరిత్రాత్మక సందర్భమే. కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఒక అడుగు ముందుకు వేసిందని భావించాలి. అయితే ప్రతి విషయాన్ని గాంధీ కుటుంబీకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని ఖడ్గే ప్రకటించారు. దీంతో కాంగ్రెస్‌లో చిత్తశుద్ధి లేని ప్రజాస్వామ్యం మాత్రమే ఉందని నిరూపితమైంది. సోనియాగాంధీ అనారోగ్యం వల్ల ఖడ్గేకు ఆ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. ఒకసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఎన్నికల్లోపార్టీని గెలిపించలేకపోయారన్న విమర్శల నేపథ్యంలో రాహుల్ గాంధీ మళ్లీ అధ్యక్ష పదవి చేపట్టడానికి ససేమిరా అన్నాడు. ఖడ్గే ఎన్నిక జరగక ముందే గాంధీ కుటుంబానికి ఇష్టుడు గనుక ఆయనే గెలుపొందు తాడన్న అభిప్రాయమే సర్వత్రా ఉంది. కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వం, అలాగే కేరళలో కాంగ్రెస్‌నాయకులు తొలినుంచి శశిథరూర్‌ను వ్యతిరేకిస్తూనే ఉన్నారు. చివరకు ఆయన అధ్యక్ష పదవికి నామినేషన్ వేసే కార్యక్రమానికి పార్టీ బాధ్యులెవరూ రాలేదు. శశిథరూర్‌కు కాంగ్రెస్ అధిష్ఠాన వర్గమే గాక వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నాయకులు దూరంగానే ఉన్నారు. ఒకరి కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే వారిని సమంగా చూసినప్పుడే అది ప్రజాస్వామ్యం అనిపించుకుంటుంది. ఇందిరాగాంధీ నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతి పదవికి అధికార అభ్యర్థిగా ప్రకటించి ఇండిపెండెంట్‌గా పోటీచేసిన వివిగిరిని గెలిపించి పార్టీలో ప్రజాస్వామ్యం లేదని నిరూపించారు. ప్రస్తుతం సోనియాగాంధీ సైతం మల్లిఖార్జున ఖడ్గే గెలుపు విషయంలో లోపాయికారిగా బాధ్యత వహించి ప్రజాస్వామ్య సూత్రాన్ని ఉల్లంఘించారు.

శశిథరూర్ తాను ఓడిపోయిన తర్వాత గెలుపొందిన ఖడ్గేను అభినందించి ఆయనకు అన్ని విధాలుగా సహకరిస్తానని ప్రకటించారు. అంతవరకు ఉన్న కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీని రద్దుచేసి సారథ్య సంఘాన్ని ఖడ్గే ఏర్పాటుచేశారు. అందరినీకలుపుకుని పార్టీని పటిష్ఠం చేయవలసిన ఖడ్గే శశిథరూర్‌ను సారథ్య సంఘంలోకి తీసుకోలేదు. గాంధీ కుటుంబానికి శశిథరూర్‌ను ప్రమోట్‌చేయడం ఇష్టంలేదని తేలిపోయింది. గాంధీ కుటుంబాన్ని సంప్రదించే ఖడ్గే ఏ నిర్ణయమైనా తీసుకుంటున్నారు. శశిథరూర్ ఉన్నత విద్యావేత్త, ఐక్యరాజ్య సమితిలో భారత దౌత్యవేత్తగా పనిచేశారు. అంతేకాదు అంతర్జాతీయ రంగంలో వివిధ పదవులను నిర్వహించారు. 2009 లో కాంగ్రెస్‌లో చేరి కేరళలోని తిరువనంతపురం నియోజక వర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. లండన్‌లో జన్మించిన శశిథరూర్ ఇక్కడికి వచ్చాడని బయటి వాడంటూ ఆయన అభ్యర్థిత్వాన్ని కేరళ కాంగ్రెస్‌నాయకులు వ్యతిరేకించారు. లోక్‌సభకు గెలిచిన ఆయన యూపీఏ ప్రభుత్వ హయాంలో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖలో సహాయమంత్రిగా పనిచేశారు. 2012లో మానవాభివృద్ధి మంత్రిత్వ శాఖ లోనూ సహాయమంత్రిగా పనిచేశారు. మంచివక్తగా పేరు తెచ్చుకున్నారు. అయినప్పటికీ ఆయనను సారథ్య సంఘంలోకి తీసుకోకపోవడమేకాదు గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలకు జరగుతున్న ఎన్నికల ప్రచారానికి ఏర్పాటుచేసిన కమిటీలోనూ ఆయన పేరులేదు. కాంగ్రెస్ ఆయనను కక్షతో వెంటాడుతోందని భావించ డానికి నాయకత్వం అవకాశంఇచ్చింది. ఆయనకు కేరళ కాంగ్రెస్ లోనూ చుక్కెదురే.

కేరళ రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికల్లో పోటీచేసి ముఖ్యమంత్రి కావాలన్న అభిలాషతో శశిథరూర్ ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో శశిథరూర్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన మద్దతుదారులు కోరుతున్నారు. కాంగ్రెస్ అధినాయకత్వం శశిథరూర్‌పట్ల ఏమాత్రం సానుకూలంగా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శశిథరూర్‌ను పార్టీ కార్య కలాపాలకు కావాలని దూరంగాఉంచడం పార్టీకి ఏమాత్రం ప్రయోజనం కల్పించదు. ఇలాంటి వైఖరి పార్టీలో అనేకమంది నాయకులకూ రుచించడం లేదని తెలుస్తోంది. ఖడ్గేతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్న శశిథరూర్ పైన నాయకత్వానికి తీవ్ర వ్యతిరేకత ఉందని స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్యబద్ధమైన వాతావరణం కాంగ్రెస్‌లో కనిపించడంలేదన్న భావన ప్రజల్లో వ్యాప్తి అయితే అది పార్టీకే నష్టం కలిగిస్తుంది.

# బౌద్ధంవైపు చూస్తున్న దళితులు

కులవివక్ష భారతీయ సమాజానికి పెద్దముప్పుగా పరిణమిస్తోంది. కుల వ్యత్యాసాలు, అంటరానితనం మనుషుల మధ్య దూరాన్ని పెంచుతాయి. ఒకరిపై ఒకరికి ద్వేషం పెరిగిపోతుంది. చివరకు మత మార్పిడులకు దారి తీస్తోంది. ఆ రకమైన ధోరణి భారత సమాజానికి ప్రమాదకరం. సమాజంలో అంతరాలు పెరిగిపోయి భిన్నత్వంలో ఏకత్వం గల మన సంస్కృతి అంతరించిపోయే అవకాశం ఉంది. అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవించే ఓ ఉద్యమాన్ని చేపట్టవలసిన బాధ్యత పెద్దలపై ఉంది. ఈ ఆధునిక సమాజంలో కూడా అగ్రవర్ణాలు, దళితులు అనే వ్యత్యాసం ప్రపంచంలో మన స్థాయిని దిగజారుస్తుంది. మన దేశంలో ఇటీవల జరిగే ధోరణులను చూస్తుంటే సమాజం ఎటుపోతుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. కుల వివక్ష, అంటరానితనం, దళితులను హీనంగా చూడటం వంటి సంఘటనలు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక మొదలైన రాష్ట్రాల్లో గత నెలలో ఇటువంటి వివిధ సంఘటనలు జరిగాయి. ఈ వివక్షకు తట్టుకోలేక ఆ దళితులందరూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేపట్టిన బౌద్ధమతంలో చేరుతున్నారు. అంతే కాకుండా, వారు అప్పటి వరకు పూజించిన హిందు దేవత విగ్రహాలను, ఫొటోలను నదుల్లో పారవేస్తున్నారు. కొందరైతే హిందూ దేవతలను కించపరుస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే మనుషుల మనసులు కలుషితమై భవిష్యత్‌లో మత కలహాలకు, వర్గ కలహాలకు దారితీసే ప్రమాదం కూడా ఉంది.

రాజస్థాన్‌లోని బారన్ జిల్లా భులేన్ గ్రామంలో అక్టోబరు 5న దళిత యువకులు దుర్గాదేవికి పూజలు చేసి హారతి ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన అగ్ర కులస్థులు కొందరు వారిపై దాడి చేసి కొట్టారు. బాధిత దళితులు ఉన్నతాధికారులు, పోలీసుల దగ్గర నుంచి రాష్ట్రపతి కార్యాలయం వరకు ఫిర్యాదులు చేశారు. 15 రోజులు గడిచిపోయినా ఫలితం లేకపోవడంతో గ్రామంలోని దళిత కుటుంబాలు ఈ నెల 21న సమావేశమై హిందూమతాన్ని వదిలి బౌద్ధం స్వీకరించాలన్న నిర్ణయానికి వచ్చారు. అందరూ కలిసి గ్రామంలో ఆక్రోష్ ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఇళ్లలో అప్పటి వరకు పూజలు చేసిన హిందూ దేవతల బొమ్మలు, చిత్ర పటాలను తీసుకెళ్లి సమీపంలోని బేతిల్ నదిలో కలిపారు. దళితులపై దాడులు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మతం మార్చుకున్నట్లు వారు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో కరేరా గ్రామంలో గత నెల 20న వాల్మీకి సమాజానికి చెందిన 236 మంది సభ్యులు కుల వివక్ష నుండి తప్పించుకోవడం కోసం బౌద్ధ మతాన్ని స్వీకరించారు. వారంతా 22 ప్రతిజ్ఞలను చదివి బౌద్ధ మతంలోకి మారారు. ఈ గ్రామంలో కుల వివక్ష చాలా సంవత్సరాలుగా కొనసాగుతోందని, కుల వివక్ష నుంచి బయటపడ డానికి, శాంతియుత మార్గంలో జీవనం గడపడానికి, ఆత్మన్యూనతా భావం నుంచి బయటపడడానికి వాల్మీకులు బౌద్ధమతం స్వీకరించి నట్లుగా బీఆర్ అంబేద్కర్ వారసులైన రాజారత్న అంబేద్కర్ తెలిపారు. గత నెల మొదటి వారంలో ఢిల్లీ మంత్రి రాజేంద్రపాల్ గౌతమ్‌తోపాటు దాదాపు వెయ్యిమంది సామూహికంగా బౌద్ధమతం స్వీకరించారు. వారంతా హిందూ దేవుళ్లను దూషించడంతోపాటు 22 ప్రమాణాలు చేశారు. "నాకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులపై విశ్వాసం లేదు, వారిని పూజించను" అని వారంతా ప్రమాణం చేశారు. కర్ణాటకలోని యాద్‌గిరి జిల్లాలోని సురపుర పట్టణానికి సమీపంలోని హుణసాగిలో గత నెల 14న బౌద్ధ మతం(బుద్ధ ధర్మ దీక్ష)లోకి మారారు. వారంతా హిందూ దేవుళ్ల ఫొటోలు, విగ్రహాలను కృష్ణానదిలో పడేశారు.

గత ఏడాది కర్ణాటకలోని కొప్పల్ జిల్లాలో ఓ గ్రామంలో రెండేళ్ల వయసున్న కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ఆలయం బైట దేవుడిని ప్రార్థిస్తుండగా, చినుకులు పడటంతో ఆ పసిబిడ్డ ఆలయంలోకి పరుగెత్తాడు. దానిని గ్రామపెద్దలు తప్పుపట్టారు. అభిషేకానికి, దేవాలయ శుద్ధి చేయడానికి రూ. 25వేల నుంచి రూ.30వేల వరకు చెల్లించాలని బహిరంగ సమావేశంలో గ్రామ పెద్దలు నిర్ణయించారు. అదే జిల్లాలో హెయిర్ కటింగ్ కోసం సెలూన్‌కి వెళ్లిన దళిత యువకులను గ్రామం నుంచి వెలివేశారు. ఆ దుకాణం గ్రామంలోని లింగాయత్‌లకు మాత్రమే అని వారు చెప్పారు. ఆధునిక భారతంలో కూడా దళితులు ఇంతటి దారుణాలను భరించవలసి వస్తోంది. ఇటువంటి వివక్ష భరించలేక బ్రిటీష్ వారి కాలం నుంచి మన దేశంలో ఎక్కువగా క్రిస్టియానిటీ స్వీకరించారు. అంబేద్కర్ భావజాలాన్ని బాగా వంటబట్టించుకున్న దళితులు ఇప్పుడు ఎక్కువగా బౌద్ధం స్వీకరిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా అనేకం జరుగుతున్నాయి. ఇటువంటి ధోరణి భారతీయ సమాజానికి కీడు చేస్తుందని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– శిరందాసు నాగార్జున,
సీనియర్ జర్నలిస్ట్ – 9440222914

# సాయంపై ఒప్పందం-శిలాజ ఇంధనాలకు స్వేచ్ఛ!

టి.వీ. సుబ్బయ్య

కాప్-27 సదస్సులో నష్టాలు, విధ్వంసంపై ఎట్టకేలకు ఒప్పందం కుదిరింది. గతంలో పారిస్, గ్లాస్గోవ్‌లలో జరిగిన సదస్సులు, ఇంకా అంతక్రితం నుండి చాలా సదస్సులు అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు పేద, వర్ధమాన దేశాలకు నష్టపరిహారంగా ఏడాదికి వంద కోట్ల బిలియన్లు ఇవ్వాలన్న తీర్మానాలు చేసినప్పటికీ పెద్దగా అమలు జరగలేదు. ఈ అంశాన్ని తీసుకొని 1992 వాతావరణ మార్పులపై ఐరాస ప్రత్యేక సదస్సు జరిపింది. సంపన్న దేశాలను ఒప్పించడం ద్వారా ఒప్పందం కుదిరింది. కాలుష్యానికి ప్రధాన కారణమైన బొగ్గు వినియోగాన్ని తగ్గించడానికి గతంలో ఒప్పందాలు జరిగాయి. 2030 నాటికి తగ్గించవలసిన లక్ష్యాల సాధన సాధ్యమయ్యేట్లు కనిపించలేదని కాప్-27 సదస్సు ప్రారంభానికి ముందు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ హెచ్చరించారు. ఇంతకాలం అధిక కాలుష్యానికి కారణమైన ధనిక దేశాలు ఆ విషయాన్ని అంగీకరించలేదు. ఇప్పుడు కుదిరిన ఒప్పందం ద్వారా తమ బాధ్యతను అంగీకరించాయి. సాయంపై ఒప్పందం చేసుకుని అన్ని విధాలుగా విధ్వంసానికి కారణమైన శిలాజ ఇంధనాల ఒప్పందం లేకుండా వాటి వినియోగానికి స్వేచ్ఛ కల్పించారా? అయితే కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో ఆర్థికవ్యవస్థలు కుదేలవడమేగాక, ప్రస్తుతం ఆర్థిక మాంద్యం పొంచిఉన్నందున ఒప్పందాన్ని ఏ మేరకు అమలుచేస్తాయో చూడాలి. నిధులేగాకుండా నూతన సాంకేతికతలను అన్ని దేశాలకు బదిలీచేయాలన్న తీర్మానాలు గతంలో సదస్సులు చేసినా అమలు జరగలేదు. ఈజిప్టులో నవంబరు 6నుంచి 19వ తేదీ వరకు ఈ సదస్సు జరిగింది.

తీవ్ర కాలుష్యానికి కారణమైన శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశలవారీగా తగ్గించాలని భారత్, ఐరోపా దేశాలు ప్రతిపాదించినప్పటికీ, సంపన్నదేశాలు ఖాతరు చేయలేదు. నష్టం, ప్రకృతి విధ్వంసాలను ఎదుర్కొన్న దేశాల జాబితాను ఇంకా తయారు చేయవలసింది. ఇందులోనూ అనేక షరతులున్నాయి. ఒక్కడ తెలిపిన రెండు అంశాలవిషయంలో ఈ సదస్సు విజయం సాధించినప్పటికీ అధిక కాలుష్యం వెదజల్లే శిలాజ ఇంధనాల వినియోగం పెరుగుతున్న అంశాన్ని పెద్దగా చర్చించలేదు. అతి కీలకమైన ఈ అంశంపై విధిగా పాటించాల్సిన ఒప్పందం లేకుండా కాలుష్యం, భూతాపం ఎలా తగ్గుతుంది? అలాగే కాలుష్యం పెరుగుదలకు, గాలి,నీరు,ఆహారం కలుషితం కావడానికి, తద్వారాపర్యావరణం అపరిమిత కాలుష్యానికి, భూతాపం పెరుగుదలను అరికట్టే చర్యలపై స్పష్టమైన, వేగంగా చర్యలు చేపట్టడానికి అవసరమైన ఒప్పందం లేదు. ఏఏ దేశాలకు

ఆర్థిక సహాయం చేయాలనే అంశాన్ని నిర్ణయించేందుకు కమిటీని ఏర్పాటుచేసి రూపొందించిన జాబితాను 2023 నవంబరులో జరగడమే కాప్-28 సదస్సులో ప్రవేశపెడతారు.అయితే కర్బనపు వాయువు తగ్గింపుకు, విపత్తుల నివారణకు అతి తక్కువ నిధులను సంపన్న దేశాలు కేటాయిస్తున్నాయి. తాజా ఒప్పందం చరిత్రాత్మకమే అయినప్పటికీ సదస్సులో తొలినుంచి ధనిక దేశాలు వ్యతిరేకించాయి. సహాయం చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్నాయేగానీ అతిస్వల్పంగా నిధులిచ్చి చేతులు దులుపుకుంటున్నాయనే ఇంతవరకుఉన్న అనుభవం, 2050 నాటికి కాలుష్యాన్ని, భూతాపాన్ని ప్రమాదస్థాయికి వెళ్లకుండా నిరోధించాలన్న లక్ష్యం నెరవేరడం కష్టమేనని గుటెర్రస్ చాలాసార్లు హెచ్చరించారు. అమెరికా ఎలాంటి ఒప్పందానికి సిద్ధంగా లేదు. అధిక కాలుష్యానికి తాము కారణమని ప్రపంచానికి తెలుస్తుందని దీని భయం. ఈ ఏడాదికి పాకిస్తాన్ తదితర అనేక దేశాల్లో వరదలు ముంచెత్తాయి. భారతదేశంలోనూ అనేక ప్రాంతాల్లో వర్షాలు, వరదలు ఎక్కువగాఉన్నాయి. అమెరికా సహా ఎండలు అపారంగా పెరిగాయి. పెద్దగా అభివృద్ధిలేని దేశాలు తమకు భారతదేశం, చైనా, అమెరికాలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేయగా తమకు సంబంధంలేదని తిరస్కరించాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందంలో భాగంగా చైనా, భారత్ అభివృద్ధి చెందుతున్న దేశాలుగా చెపుతున్నప్పటికీ వీటి వృద్ధిని పరిగణలోకి తీసుకుని పరిహారం చెల్లించకపోవచ్చు. ఇంకానిర్ణయం కావలసిఉంది.

పారిస్, గ్లాస్గోవ్ సదస్సుల్లో బొగ్గు, శిలాజ ఇంధనాల వినియోగాన్ని 2030 నాటికి తగ్గించే లక్ష్యాలను ప్రకటించాయి. ఈజిప్టు సదస్సులో ఈ విషయం పెద్దగా పట్టించుకోకుండా మౌనంగా ఉన్నాయి. తగ్గింపు ప్రతిపాదన వచ్చినా అమెరికా తదితర సంపన్న దేశాలు స్పందించలేదు. 2030 నాటకి 45శాతం బొగ్గు వినియోగం తగ్గిస్తానని భారతదేశం వాగ్దానం చేసినప్పటికీ లక్ష్యానికి ఆమడదూరంలో ఉన్నదని ఐరాస అధ్యయనం తెలిపింది. బొగ్గు బావులను మరింతపెంచింది. ప్రత్యామ్నాయ ఇంధనాలు ఉత్పత్తి పెంచుకోకుండా సంప్రదాయంగా వస్తున్న ఇంధనాల వినియోగం ఒక్కసారి తగ్గించడం కష్టమే. కాలుష్యం, భూతాపం పెరిగిపోతోందని ఐరాస ఎంత మొత్తుకున్నా అధిక కాలుష్యకారక దేశాలు ఈ విషయాన్ని గుర్తించడానికే 30ఏళ్లపైగా పట్టింది. గుర్తించాక కూడా రెండు దశాబ్దాలకుపైగా చర్చలు జరుగుతున్నా చర్యలు లేవు.

భూమండలం మరింత వేడెక్కకుండా చూడాలంటే తక్షణం బొగ్గు, శిలాజ ఇంధనాల వినియోగాన్ని 2050నాటికి దాదాపు పూర్తిగా తగ్గించాలని పారిస్ సదస్సు తీర్మానించింది. ఈ సదస్సు 2015లో జరిగింది. దాదాపు ఏడేళ్లు గడుస్తున్నప్పటికీ చర్యలు అంతంతమాత్రమే. ఇక రోజురోజుకీ పెరుగుతున్న ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు- కార్లు, బస్సులు, లారీలు తదితరాలు వెదజల్లుతున్న కాలుష్యం అపారం. వీటి నుంచి వెలువడే సూక్ష్మ ధూళి కణాలు వాతావరణంలోకి చేరి వాయుకాలుష్యం ఇప్పుడు అనేక రెట్లు పెరిగింది. ఇక అన్ని రకాల పరిశ్రమలు కాలుష్యానికి ప్రధానకారణాల్లో ఒకటి. వ్యవసాయంలో వాడుతున్న రసాయన ఎరువులు, పురుగుమందులు, నీరు, ఆహారం కలిషితం కావడానికి ప్రధానకారణం. వీటి కారణంగా ఇప్పటికే, వందలాది రకాల పక్షులు, జంతుజాలం నాశనమయ్యాయి. అడవులు విచ్చవిడిగా నరికేస్తున్నారు. వీటివల్ల జీవవైవిధ్యం దెబ్బతిని కాలుష్యానికి దారి తీస్తుంది. ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరం. నిత్యజీవితంలో వీటివినియోగం పెరిగి మనిషిఆరోగ్యాన్ని క్రమంగా క్షీణింపచేస్తోంది. ఇవన్నీ కాలుష్యానికి, భూతాపం పెరగడానికి దోహదం చేస్తున్నాయి. వీటిపైన లోతైన చర్చలు జరిపి ఒప్పందాలు కుదుర్చుకోకపోవడం ఇంతవరకు జరిగిన సదస్సుల్లో ఏ దేశం కూడా ముఖ్యంగా సంపన్నదేశాలు కళ్లు తెరుచుకోలేదని, పాఠాలు నేర్చుకోలేదని భావించాలి. అలాగే ప్రపంచాన్ని ఎన్నోసార్లు కాల్చి బూడిద చేసేస్థాయిలో ఆయుధాలు, అణ్వాయుధాలు తయారుచేసి విక్రయించి అపార లాభాలు పొందుతున్న దేశాల విధ్వంసక అభివృద్ధి పేరుతో ఎండమావుల వెంట పరుగెడుతున్నాయి. పెట్టుబడీదారీ వ్యవస్థలు తీవ్రంగా విభిన్నరంగాల్లో సంక్షోభాలను ఎదుర్కోవడానికి యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు కారణమవు తున్నాయి. అలాగే ఆయుధాల నుండి వెలువడే విషతుల్యాలూ అపారంగా పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నాయి. స్థానికంగా కాలుష్యం, భూతాపం నివారణ చర్యలు ఎక్కువగా ఉపయోగపడతాయి. వీటిపైన చర్చలు, ఒప్పందాలు జరగకుండా అమలు జరగని ప్రణాళికలున్నా ఉపయోగం ఉంటుందా?

# పర్యావరణంపై మరో ప్రతిజ్ఞ

ఈజిప్టులో ప్రపంచదేశాల 27వ పర్యావరణ సదస్సు ముగిసింది. కాప్-27గా పిలిచిన ఈ సదస్సులో పర్యావరణ దుష్ప్రభావాలకు లోనయ్యే దేశాలకు పరిహారం రూపంలో సాయం చెయ్యడానికి ఉద్దేశిస్తూ ఒక నిధిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేవలం ప్రకటన చేశారు తప్పించి ఆ నిధుల సమీకరణ, వినియోగం తదితర విధివిధానాలు చర్చించలేదు. ఆ విషయాలన్నీ వచ్చే ఏడాది జరగబోయే సదస్సులో చర్చించి నిర్ణయిస్తారు. ప్రస్తుతానికి ఇలాంటి ఒక నిధి ఏర్పాటు చెయ్యాలన్న భావన రావడమే గొప్ప. పేద దేశాలన్నీ కలిసి వత్తిడి తీసుకురావడం వల్లనే ధనిక దేశాలు ఒప్పుకున్నాయి గానీ నిధి కార్యరూపంలో రావడానికి ఎంత మొరాయిస్తాయో చూడాల్సి ఉంది. ఎందుకంటే ఇప్పటివరకూ జరుగుతున్న సదస్సుల్లో తీసుకుంటున్న నిర్ణయాలు పేపర్ మీదనే ఉంటున్నాయి తప్పించి అమలు కావడం లేదు. పర్యావరణంపై అమెరికా, యూరప్ వంటి దేశాల చిత్తశుద్ధి అలాంటిది. ఆయా దేశాలు పర్యావరణంపై పూచీ పడడం, పడాల్సి ఉండడం పరోపకారి బుద్ధితో చెయ్యాల్సిన కార్యక్రమం కాదు. చేసిన నష్టానికి పరిహారంగా చెయ్యాల్సిన నైతిక భాధ్యత. తప్పించుకోలేని భాధ్యత. పారిశ్రామికీకరణ పేరుతో పర్యావరణాన్ని ధ్వంసంచేసి ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టినందుకు చెల్లించాల్సిన మూల్యం తిలాపాపం తలా పిడికెడులా అన్ని దేశాలకూ ఇందులో భాధ్యత ఉన్నా ఎక్కువ నష్టం కలగజేసినందుకు ధనిక దేశాలు ఎక్కువ బాధ్యత వహించాల్సిఉంది. ప్రకృతి నుంచి దోచుకున్నదంతా దోచుకొని ఇప్పుడు అన్ని దేశాలకూ ఉద్గారాల విషయమై ఒకే స్థాయి నియమాలు వర్తింపచేయడం మోసం. మిగిలిన దేశాలు ప్రత్యామ్నాయ ఇంధనం వైపు మళ్లడానికి నిధులెక్కువ అవసరం. ఆ సాయం వారందించాలి. పర్యావరణం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయి. ఒక వైపు వరదలు, కరువులతో ప్రపంచదేశాలు నష్టపోతున్నాయి. నష్టానికి భాధ్యత వహిస్తూ వారికి అందించబోయే నిధుల్లో ధనిక దేశాలు ముందంజలోఉండాలి. పారిశ్రామికీకరణ దశలో భూగోళానికి ఉన్న వేడిమికి ఒకటిన్నర సెంటిగ్రేడు కన్నాఎక్కువ పెరగ నియ్యరాదన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ముఖ్యభూమిక పోషించాల్సింది పర్యావరణానికి ఎక్కువ నష్టం కలుగజేసిన, కలుగజేస్తున్న అమెరికా,యూరప్,చైనాతదితర ధనిక దేశాలే.

–డా. డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, 94408 36931

# భారత్‌లో లోపిస్తున్న ఫుట్‌బాల్ సంస్కృతి

ప్రస్తుతం అందరి దృష్టి ఖతార్‌లో ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌పైనే. ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా ఈవెంట్ ఫిఫా పురుషుల ప్రపంచ కప్ పోటీలు ఆదివారం ఖతార్‌లో అత్యంత అట్టహాసంగా ప్రారంభమైంది. అయితే భారత్‌లో ఫుట్‌బాల్ సంస్కృతి లేకపోవడం అత్యంత ఆందోళన కరమైన విషయం. అత్యంత ప్రజాదరణ పొందిన అతి ప్రియమైన క్రీడగా దీనిని మనం చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఈ ఆటలో ఇరుజట్లమధ్య పోటీ మంచి అనుభూతి. ప్రపంచ దేశాలు తమ ప్రతిష్ఠను ఇనుమడింపచేసుకునే సాధనంగా ఫుట్‌బాల్ క్రీడను చెప్పుకోవచ్చు. ఢిల్లీ ప్రభుత్వం నిర్వహిస్తున్న తొమ్మిది స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో ఫుట్‌బాల్‌కు ఇద్దరు కోచ్‌లు మాత్రమే ఉండటం విశేషం.. దేశంలోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 140 కోట్ల మంది ఉన్న మన దేశంలో ప్రపంచంలో అత్యధికమంది ఇష్టపడే ఫుట్‌బాల్ ఆటకు కావలసిన 11 మంది ఆటగాళ్లకు శిక్షణ ఇవ్వకపోవడం ఎందుకు కష్టమైంది? ఢిల్లీ ప్రభుత్వం నగరంలో తొమ్మిది క్రీడా సముదాయాలను నిర్వహిస్తోంది. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో 35 మంది కోచ్‌లను నియమించింది. వీటిలో అథ్లెటిక్స్, కబడ్డీ, యోగా, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, హాకీ, ఆర్చరీ, బాస్కెట్ బాల్, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ ఉన్నాయి. వీటికి సంబంధించి 35 మంది కోచ్‌లలో ఫుట్‌బాల్ ఆటగాళ్లు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఖతార్‌లో ఆదివారం ప్రారంభమైన ఫిఫా ప్రపంచకప్ కోసం ప్రపంచవ్యాప్తంగా అభిమానులు టీవీలు, సెల్‌ఫోన్ వీక్షణంలో నిమగ్నమయ్యారు. ఈ సంవత్సరం 32 జట్లు గ్రాండ్ టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. అయితే ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, భారతదేశం ఎప్పుడూ ఏ టోర్నమెంట్‌లో పాల్గొనలేదు. అయినప్పటికీ, భారతదేశం అంతటా ఫుట్‌బాల్ క్రీడను చూస్తూ ఆనందిస్తారు. కానీ అది ఆడేందుకు అవసరమైన ప్రోత్సాహం అతి తక్కువగా ఉంది. క్రీడా సామర్థ్యాలను పెంపొందించుకోవాలనే రాజకీయ సంకల్పాన్ని అధికారులు ప్రదర్శించకపోవడంతో క్రీడాకారులకు వసతులు, మైదానాలు సైతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఢిల్లీ సీనియర్ డివిజన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఢిల్లీ ఫుట్‌బాల్

పాలకమండలి నిర్వహిస్తోంది. ఈ నెల 17న జరిగిన లీగ్‌మ్యాచ్ చూసేందుకు గాను 50 మంది కంటే తక్కువ మంది ప్రేక్షకులు మైదానంలో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలలోని ప్రభుత్వాలు ఈ క్రీడను ప్రోత్సహిస్తున్నట్లు, నిధులు సమకూరుస్తున్నట్లు తరచుగా పేర్కొంటున్నప్పటికీ, వాస్తవానికి ఈ క్రీడపై తక్కువ ప్రభావం కనిపిస్తుంది.

భారత్‌లో ఫుట్‌బాల్ పతనానికి క్రికెట్ పాక్షికంగా కారణం. 1983 క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన తర్వాత, ఫుట్‌బాల్ సహా ఇతర క్రీడలను ఎక్కువగా నిర్లక్ష్యం చేసేంత స్థాయిలో క్రికెట్‌కు భారతదేశంలో ఆదరణ పెరిగింది. నేటికీ, మనకు కనీసం దాదాపు ప్రతి ఇంట్లో ఒక విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్, ధోని పోస్టర్ తప్పనిసరిగా ఉంటాయి. మీడియాలో అయినా, బాలీవుడ్‌లో అయినా సరే క్రికెట్‌కు ఎప్పుడూ ప్రత్యేకత ఉంది. న్యూస్ ఛానెల్‌లు క్రికెట్‌పై గంటలు గంటలు చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తాయి. క్రికెట్, క్రికెటర్లపై సినిమాలు విపరీతంగా పెరుగుతున్నాయి. రేడియోలో క్రికెట్ వ్యాఖ్యానాలు కూడా వినేఅవకాశంఉంది. ప్రస్తుతం ప్రాంతీయ ఛానళ్లలో కూడా ఆయా భాషల్లో క్రీడలపై రన్నింగ్ కామెంట్రీని వినవచ్చు. వార్తాపత్రికల 'క్రీడల' పేజీలలో, హెడ్‌లైన్ దాదాపు ఎల్లప్పుడూ క్రికెట్‌దే. ఇండియన్ సూపర్ లీగ్ ప్రారంభమైన 2014 తర్వాత కొన్ని మార్పులు మాత్రమే కనిపించాయి. కేరళ, పశ్చిమ బెంగాల్, గోవా, నార్త్ ఈస్ట్‌లలో ఫుట్‌బాల్‌ను ఇష్టపడే వ్యక్తులను ప్రతిచోటా చూస్తాము. కేరళ, పశ్చిమ బెంగాల్ ఫుట్‌బాల్ కోసం సారవంతమైన వాతావరణాన్ని పెంచాయి. అయితే మహారాష్ట్రలోని కొల్హాపూర్ వంటి చిన్న పట్టణాలలో, స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఫుట్‌బాల్ ఆడేవారు. నేటికీ కొల్హాపూర్‌లోని షాహూ స్టేడియంలో జరిగే ఫైనల్ ఫుట్‌బాల్ మ్యాచ్ చూసేందుకు వేలాది మంది టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ప్రపంచకప్‌ను పండుగలా జరుపు కుంటారు. కొల్హాపూర్‌లోని ఫుట్‌బాల్ కోచ్ అభిజీత్ వానీరే మాట్లాడుతూ, "ఇక్కడి పిల్లలలో చాలా ప్రతిభ ఉంది, కానీ మౌలిక సదుపాయాల కొరత ఉంది, ఆటగాళ్లకు ఆడటానికి మైదానాలు లేవు. ఇక్కడి మైదానాలు అతి తక్కువ నాణ్యత కలిగి ఉండటంతో ఆటగాళ్లను గాయాలకు గురి చేస్తుంది. భోపాల్, కాలికట్, పశ్చిమ బెంగాల్ వంటి ప్రదేశాలకు విశ్వవిద్యాలయ జట్టుతో ఆటగాళ్లను తీసుకెళ్లినప్పుడల్లా పచ్చిక మైదానాలు కనిపిస్తాయి, కానీ కొల్హాపూర్‌లో అలాంటి మైదానాలు లేవు. కొల్హాపూర్ వంటి గోతుల్లో ఫుట్‌బాల్‌పై ఉన్న మక్కువ భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరుకోలేదు. కానీ అలా ఉన్నా సంతోష్ ట్రోఫీ, ఐ లీగ్, ఐఎస్ఎల్ లలో కేరళ ఆటగాళ్లు బాగానే ఆడుతున్నారు. ఫుట్‌బాల్‌ను బెంగాల్, కేరళ, గోవా, ఈశాన్య ప్రాంతాలు ఆధిపత్యం వహించే ప్రాంతీయ క్రీడగా మార్చడం నుండి, దాని ప్రజాదరణ పాన్-ఇండియా ఉండాలి. తదుపరి మరిన్ని అకాడమీల వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి, ఎక్కువ మంది కోచ్‌లను నియమించవలసిన అవసరం ఉంది.

భారతదేశంలో ఫుట్‌బాల్‌ను అట్టడుగు స్థాయిలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఢిల్లీ వంటి ప్రదేశాల్లో ప్రభుత్వం కొత్తగా ఫుట్‌బాల్ సెంటర్లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇవ్వాలి. ఫిఫాలో భారతదేశం పేలవమైన ర్యాంక్‌కు ప్రధాన కారణాలలో ఒకటి క్రీడపై అవగాహన లేకపోవడమే. ఫుట్‌బాల్ వాతావరణాన్ని బలహీనపరిచే రాజకీయ జోక్యాన్ని అరికట్టాలి.

– ఈడ్పుగంటి రోమిల

# అంగన్‌వాడీల నిరవధిక ధర్నా

## ఒడిశాలో 60 వేల కేంద్రాల మూసివేత

## డిమాండ్లు పరిష్కరించాల్సిందే

## ఆందోళనకారుల స్పష్టీకరణ

**భువనేశ్వర్:** ఒడిశాలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మంగళవారం నుంచి నిరవధిక ధర్నా ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలో 60 వేల అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేరేంత వరకూ ఆందోళనను విరమించేది లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని వివధ ప్రాంతాల నుంచి వచ్చిన అంగన్‌వాడీలు సోమవారం భువనేశ్వర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు అసెంబ్లీ సమీపంలో ధర్నా ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.18 వేలు, వారి సహాయకులకు రూ.9 వేలు చెల్లించాలని చాలాకాలంలో ఆందోళనలు చేస్తున్నారు. ప్రత్యేకించి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారు. అంతేకాకుండా నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, ఈ డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనను విరమించేది లేదని ఆల్ ఒడిశా అంగన్‌వాడీ లేడీ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమిత్రా మహాపాత్ర స్పష్టంచేశారు. సర్వీసుకాలంలో మృతి చెందితే అంగన్‌వాడీ కార్యకర్తల కుటుంబసభ్యులకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆల్ ఒడిశా అంగన్‌వాడీ లేడీ వర్కర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఝునుపమ సత్పతి మాట్లాడుతూ 'ఈ రోజు రెండోరోజు. సోమవారం 50 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ ప్రదర్శన చేశారు. నేటి నుంచి నిరవధిక ధర్నాకు కూర్చున్నారు. 314 బ్లాక్ కార్యాలయాల వద్ద పురుష అంగన్‌వాడీలు ఆందోళనలు చేస్తున్నారు' అని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తల కారణంగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మమత యోజన, హరిశ్చంద్ర యోజన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, అయినా తమ డిమాండ్లు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. 24 గంటలు పనిచేస్తున్నా అంగన్‌వాడీలకు నెలకు రూ.7,500 వేతనం మాత్రమే ఇస్తున్నారని మహాపాత్ర చెప్పారు. అఖిలభారతీయ అంగన్‌వాడీ మహాసంఘ్ కార్యనిర్వాహక కార్యదర్శి అంజలి పటేల్ మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికి వందకు పైగా లేఖలు రాశామని, అయినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. దీనికిబదులుగా రాష్ట్ర ప్రభుత్వం తమను అవమానించిందని, తమపై మరింత పనిభారం మోపిందని నిందించారు. చివరికి ప్రభుత్వానికి 15 రోజుల నోటీసు ఇచ్చిన తర్వాతే తాము సమ్మెకు దిగామని అంజలి చెప్పారు. కాగా, అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల ప్రభుత్వానికి సానుభూతి ఉందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖమంత్రి వాసంతి హేంబ్రం అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల ప్రకారం అంగన్‌వాడీలకు వేతనాలు ఇస్తున్నామని, అంగన్‌వాడీల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## శ్రద్ధావాకర్ హత్యకేసు...

# అఫ్తాబ్ పోలీస్ కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రద్ధావాకర్ హత్య కేసులో పోలీసుల విచారణ వేగంగా సాగుతోంది. ఈ కేసులో నిందితుడు అఫ్తాబ్ అమీన్ పూనావాలాకు మంగళవారంతో ఐదు రోజుల కస్టడీ ముగియడంతో పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిల్లీలోని సాకేత్ కోర్టు జడ్జి ముందు అఫ్తాబ్‌ను హాజరు పరిచారు. ఈ సందర్భంగా కోర్టు అఫ్తాబ్‌ను ప్రశ్నించింది. శ్రద్ధాను తానే చంపేశానని అఫ్తాబ్ అంగీకరించాడు. ఆవేశంలో అలా జరిగిపోయిందని చెప్పుకొచ్చాడు. శ్రద్ధాను చంపి, ఆమె శరీర భాగాలను వివిధ ప్రదేశాల్లో పడేశానని తెలిపాడు. కేసు విచారణలో పోలీసులకు సహకరిస్తున్నానని కూడా కోర్టులో చెప్పాడు. శ్రద్ధా శరీర భాగాలను పడేసిన ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్‌లను కూడా పోలీసులకు అందజేశానన్నాడు. శ్రద్ధా హత్యకు సంబంధించిన అన్ని వివరాలు పోలీసులకు ఇస్తానని, అయితే ఇది జరిగి చాలాకాలం అయినందున చాలా విషయాలు గుర్తుకు రాలేదన్నారు. దీంతో అఫ్తాబ్‌కు పోలీసు కస్టడీని న్యాయస్థానం మరో నాలుగు రోజులకు పొడిగించింది. ఇదిలా ఉండగా... అఫ్తాబ్ తప్పుడు సమాచారం ఇచ్చి విచారణను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అతడికి పాలిగ్రాఫ్ పరీక్ష చేపట్టాలని నిర్ణయించారు. దీని తర్వాత నార్కో అనాలసిస్ పరీక్ష కూడా జరపనున్నారు. ఈ రెండూ పరీక్షలు చేయించుకునేందుకు నిందితుడు అంగీకరించాడని, పది రోజుల్లో వీటిని పూర్తి చేస్తామని పోలీస్ అధికారులు వెల్లడించారు. కాగా పాలిగ్రాఫ్ పరీక్షకు కోర్టు కూడా అనుమతి ఇచ్చింది.

## గుజరాత్ బరిలో 1621 మంది అభ్యర్థులు

**అహ్మదాబాద్:** గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల బరిలో మొత్తం 1621 మంది నిలిచినట్లు ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారంతో రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత అభ్యర్థుల జాబితాను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. 182 మంది సభ్యులతో గల గుజరాత్ అసెంబ్లీకి రెండు విడతలుగా డిసెంబరు ఒకటి, డిసెంబరు 5 తేదీల్లో పోలింగ్ జరుగుతుంది. రెండో విడత జరగనున్న 93 సీట్లకు 833 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొదటిదశకు సంబంధించి 89 సీట్లకుగాను 788 మంది బరిలో నిలిచారు. అధికార బీజేపీ మొత్తం 182 సీట్లకు పోటీ చేయగా ప్రతిపక్ష కాంగ్రెస్ 179 సీట్లలో అభ్యర్థులను నిలిపింది. మూడు సీట్లను మిత్రపక్షం ఎన్‌సీపీకి కేటాయించింది. అయితే, దేవగఢ్ బరియా నుంచి ఎన్‌సీపీ అభ్యర్థి వైదొలగడంతో ఆ పార్టీ ఇద్దరికే పరిమితమైంది. గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) 182 సీట్లకు పోటీ చేస్తోంది. అయితే చివరి దశలో సూరత్ తూర్పు నుంచి ఆప్ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో 181 మంది మాత్రమే ఆప్ నుంచి పోటీలో నిలిచినట్లు అయింది. ఎంఐఎం 14 సీట్లలో పోటీ చేయగా బాపునగర్ నుంచి ఆ పార్టీ అభ్యర్థి నామినేషన్ వెనక్కి తీసుకున్నారు. ఎంఐఎం నుంచి 13 మంది బరిలో నిలిచారు. సౌరాష్ట్ర-కచ్ ప్రాంతం, దక్షిణ గుజరాత్ జిల్లాల్లో మొదటిదశలో పోలింగ్ జరుగుతుంది. రెండోదశలో సెంట్రల్, ఉత్తర గుజరాత్ జిల్లాల్లో ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు డిసెంబరు 8న చేపడతారు.

## తేల్తుంబ్డే బెయిల్‌పై సుప్రీం విచారణ 25న

**న్యూఢిల్లీ:** ఎల్గార్ పరిషత్- మావోయిస్టు సంబంధాల కేసులో మానవహక్కుల నేత ఆనంద్ తేల్తుంబ్డే బెయిల్ రద్దు చేయాలని కోరుతూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) దాఖలు చేసిన పిటిషన్‌ను 25వ తేదీ శుక్రవారం విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. హైకోర్టు బెయిల్ ఆదేశాలపై ఆపరేషన్లకు సంబంధించి స్టే ఇవ్వడానికి వారం రోజులు మాత్రమే మిగిలి ఉందని, అందువల్ల ఈ అంశంపై అత్యవసరంగా విచారణ చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన విజ్ఞప్తిని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. తేల్తుంబ్డే బెయిల్ రద్దు చేయాలని ఎన్ఐఏ పిటిషన్ దాఖలు చేసిందని, దీనికి నంబరు కూడా ఇవ్వారని, అందువల్ల దీనిని అత్యవసర విచారణకు స్వీకరించాలని సొలిసిటర్ జనరల్ కోరారు. 'ఈ కేసును ఆరోజు మధ్యాహ్నం 12.45 గంటలకు విచారణ చేపడదాం' అని జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ జేబీ పార్టీవాలాతో కూడిన ధర్మాసనం తెలిపింది. అయితే, తన సహచరుడు ఈరోజు కోర్టుకు రాలేదని, గురువారం విచారణ చేద్దామని తుషార్ వేడుకున్నారు. శుక్రవారం విచారణ చేద్దామని సీజేఐ చెప్పారు. తేల్తుంబ్డే తరపు న్యాయవాది అపర్ణ భట్ స్పందిస్తూ కేవియట్‌పై తాను హాజరవుతున్నానని, ఎన్ఐఏ అభ్యర్థనకు సంబంధించిన పిటిషన్ కాపీ తనకు ఇవ్వాలని కోరారు. నిందితుడి తరపు న్యాయవాదికి కాపీ ఇస్తామని సొలిసిటర్ జనరల్ చెప్పారు. తేల్తుంబ్డేకు బోంబే హైకోర్టు గత శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. మావోయిస్టు పార్టీలో ఆయనను క్రియాశీల సభ్యుడిగా చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని, అందువల్ల బెయిల్ ఇస్తున్నామని హైకోర్టు స్పష్టంచేసింది.

# 'ఎలక్టోరల్ బాండ్ల'పై 6న సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ :** శాసనసభలతో కూడిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (యూటీలు) శాసనసభలకు సాధారణ ఎన్నికల సంవత్సరంలో ఎలక్టోరల్ బాండ్ల విక్రయాన్ని మరో 15 రోజులు పొడిగిస్తూ ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత దాఖలు పిటిషన్‌ను డిసెంబర్ 6న విచారిస్తామని సుప్రీం కోర్టు మంగళవారం తెలిపింది. 2018 ఎలక్టోరల్ బాండ్ పథకం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలయిన ఇతర పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో పాటు కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాకూర్ తాజా పిటిషన్‌ను డిసెంబర్ 6న విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు హిమా కోహ్లీ, జేబీ పార్దీవాతో కూడిన ధర్మాసనం తెలిపింది. రాజకీయ నిధుల్లో పారదర్శకత తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగా రాజకీయ పార్టీలకు ఇచ్చే నగదు విరాళాలకు ప్రత్యామ్నాయంగా ఎలక్టోరల్ బాండ్లను రూపొందించారు. ప్రభుత్వం 2018 జనవరి 2న ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని నోటిఫై చేసింది. పథకం నిబంధనల ప్రకారం, ఎలక్టోరల్ బాండ్లను భారతదేశ పౌరుడు లేదా భారతదేశంలో విలీనం చేయబడిన లేదా స్థాపించబడిన సంస్థ ద్వారా కొనుగోలు చేయవచ్చు. అలాగే ఒక వ్యక్తి ఒంటరిగా లేదా ఇతర వ్యక్తులతో కలిసి ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయవచ్చు. కాగా ఎలక్టోరల్ బాండ్లను స్వీకరించడానికి ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఎ కింద నమోదయిన రాజకీయ పార్టీలు, గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల సభకు లేదా రాష్ట్ర శాసనసభకు పోలైన ఓట్లలో కనీసం ఒక్క శాతం ఓట్లను సాధించిన పార్టీలు మాత్రమే అర్హులు. నోటిఫికేషన్ ప్రకారం, ఎలక్టోరల్ బాండ్లను అర్హత కలిగిన రాజకీయ పార్టీ అధీకృత బ్యాంకులో ఉన్న బ్యాంక్ ఖాతా ద్వారా మాత్రమే నగదు చేసుకోవాలి. ఇటీవల రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభలకు సాధారణ ఎన్నికల సంవత్సరంలో ఎలక్టోరల్ బాండ్ల విక్రయానికి '15 రోజుల అదనపు వ్యవధి' అందించడానికి 2018 ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని సవరిస్తూ కేంద్రం తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిని కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ సవాలు చేశారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ, సీపీఎం, మరికొందరు పిటిషనర్లు దాఖలు చేసిన వ్యాజ్యాలతో సహా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని మరో బెంచ్ స్వాధీనం చేసుకుంది. ఎలక్టోరల్ బాండ్ల పథకం పూర్తిగా పారదర్శకమైన రాజకీయ నిధుల విధానమని, దీని ద్వారా నల్ల లేదా లెక్కలో చూపని డబ్బును పొందడం అసాధ్యమని కేంద్రం అక్టోబర్ 14న ధర్మాసనానికి తెలిపింది. డబ్బును స్వీకరించే విధానం చాలా పారదర్శకంగా ఉంది. మేము దశల వారీగా వివరిస్తాము. ఇప్పుడు నల్లడబ్బు లేదా లెక్కలో చూపని డబ్బును పొందడం అసాధ్యం. ఇది అత్యంత పారదర్శకమైన వ్యవస్థ. ఇది ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని చెప్పడానికి అవకాశం లేదు' అని కేంద్ర ప్రభుత్వం తరపున హాజరయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జస్టిస్ గవాయ్, బి.వి.నాగరత్నతో కూడిన ధర్మాసనానికి తెలిపారు. కాగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున వాదించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్... ఇది ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేసే అత్యంత పరస్పర అనుసంధానిత సమస్య అని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ ద్వారా రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చే చట్టాలను సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్లను విశాల ధర్మాసనానికి పంపాలా వద్దా అనే విషయాన్ని డిసెంబర్ 6న పరిశీలిస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. అత్యున్నత న్యాయస్థానం దీనిని ఒక ముఖ్యమైన అంశంగా పేర్కొంది. దీనికి వివరణాత్మక విచారణ అవసరమని, అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌ల సహాయాన్ని కోరింది. కేంద్రం ఎలక్టోరల్ బాండ్ పథకం 2018పై స్టే ఇవ్వడానికి 2019 ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు నిరాకరించింది.

# సర్దార్‌కు అడుగడుగునా అవమానం

## కాంగ్రెస్‌పై అమిత్‌షా ఆరోపణ

**కంభట్:** సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను కాంగ్రెస్ అన్ని రకాలుగా అవమానించిందని, ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలవేళ పటేల్‌ను పొగడ్తలతో ముంచెత్తడం ప్రారంభించిందని కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. భారతదేశ ప్రథమ ఉపప్రధాని పటేల్‌కు గౌరవప్రదంగా నివాళి కూడా అర్పించలేదని ఆయన ఎదురుదాడి చేశారు. ఆనంద్ జిల్లా కంభట్‌లో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా ప్రసంగించారు. 'సర్దార్ పటేల్‌ను కాంగ్రెస్ ఇప్పుడు కీర్తించడం నాకు ఆశ్చర్యంగా ఉంది. పటేల్ గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం నా చిన్నతనం నుంచి ఏనాడు వినలేదు. అంతేకాకుండా ఆయనను అవమానించడానికి అన్ని విధాలా ప్రయత్నించారు. ఆయన చనిపోయినప్పుడు పద్ధతిగా నివాళి కూడా అర్పించలేదు. పటేల్ గుర్తుగా ఒక్క స్మారకస్థూపం కూడా నిర్మించలేదు' అని షా విమర్శించారు. ఐక్యతా విగ్రహం నిర్మాణం ద్వారా పటేల్‌కు ప్రధాని నరేంద్రమోదీ నిజమైన నివాళి అర్పించారని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద విగ్రహాన్ని పటేల్ కోసం నిర్మించామని తెలిపారు. ఐక్యతా విగ్రహం వద్ద పటేల్‌కు నివాళి అర్పిస్తున్న ఒక్క ఫొటోనైనా చూపించగలరా అని కంభట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థికి షా సవాల్ చేశారు. కేవాడియాలోని పటేల్ విగ్రహాన్ని సందర్శిస్తే టికెట్ ఇవ్వరన్న భయంతో ఒక్క కాంగ్రెస్ నేత ఐక్యతా విగ్రహాన్ని సందర్శించలేదని ఆరోపించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం అయోధ్యలో రామాలయ నిర్మాణం, ట్రిపుల్ తలాక్ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించిందని చెప్పారు. రామాలయం, ట్రిపుల్ తలాక్‌కు మద్దతిస్తే ఆ వర్గాల ఓట్లు కోల్పోతామన్న భయం కాంగ్రెస్‌కు ఉందని, తాను ఎవరి ఓట్ల గురించి మాట్లాడుతున్నానో అందరికీ తెలుసుని వ్యాఖ్యానించారు.

# పైలెట్‌ను సీఎం చేయకపోతే రాహుల్ యాత్రను అడ్డుకుంటాం

## గుజ్జర్ నాయకుడి హెచ్చరిక

**జైపూర్:** సచిన్ పైలెట్‌ను ముఖ్యమంత్రిని చేయకపోతే రాజస్తాన్‌లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను అడ్డుకుంటామని గుజ్జర్ నాయకుడు విజయ్‌సింగ్ బైన్స్‌లా స్పష్టంచేశారు. గుజ్జర్లకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలతో పాటు సచిన్ పైలెట్‌ను సీఎంగా అంగీకరించాలని డిమాండ్ చేశారు. రాహుల్ యాత్రను అడ్డుకోవడానికి గుజ్జర్ అరక్షణ్ సంఘర్షణ సమితి నాయకులు బుధవారం నుంచి రంగంలోకి దిగుతున్నారని చెప్పారు. డిసెంబరు 3వ తేదీన రాహుల్ యాత్ర రాజస్తాన్‌లో ప్రవేశిస్తుంది. భారత్ జోడో యాత్రను అడ్డుకుంటామని బైన్స్‌లా ఇప్పటికి రెండుసార్లు బెదిరించారు. రాజస్తాన్ ముఖ్యమంత్రిగా సచిన్ పైలెట్‌ను చేయాలని సోమవారం దౌసాలో ఆయన డిమాండ్ చేశారు. 'ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఇంకా ఏడాది మాత్రమే మిగిలి ఉంది. ఇప్పుడు సచిన్ పైలెట్‌ను ముఖ్యమంత్రి చేయాలి. పైలెట్‌ను ముఖ్యమంత్రి చేస్తే రాహుల్ యాత్రను స్వాగతిస్తాం. లేకపోతే వ్యతిరేకిస్తాం' అని గుజ్జర్ నేత తెగేసి చెప్పారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని గుర్జార్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ గుర్జార్ ముఖ్యమంత్రితోనే రాజస్తాన్‌లో అడుగుపెట్టాలని, లేదంటే సరైన సమాధానం చెబుతామని ఓ వీడియో ద్వారా హెచ్చరించారు. గుర్జార్‌ను ముఖ్యమంత్రి చేస్తారన్న ఆశతో 2018లో ఆ సామాజికవర్గం కాంగ్రెస్‌కు ఓటేసిందని ఆయన గుర్తుచేశారు. సచిన్ పైలెట్‌ను ఎమ్మెల్యేను చేయడానికి తాము ఓటు వేయలేదని, గుజ్జర్‌ను సీఎం చేయడానికి ఓటేశామని చెప్పారు. సచిన్‌ను ఎమ్మెల్యే చేశారు. సీఎంను ఎప్పుడు చేస్తారు రాహుల్‌గాంధీ జీ అని ప్రశ్నించారు. డిసెంబరు 3న మీరు గుర్జార్ సీఎంతో కలిసి రాజస్తాన్‌లో అడుగుపెట్టండి లేదా గుర్జార్ సీఎంపై సమాధానంతో రండి అని డిమాండ్ చేశారు. గుజ్జర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. అనేక సమస్యలు ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం గుజ్జర్లు డిమాండ్ చేస్తున్నారు.

# చిరుతల ఆరోగ్య పర్యవేక్షణకు వెటర్నరీ శాస్త్రవేత్తల బృందం

**జబల్పూర్:** ఇటీవల నమీబియా నుంచి భారత్‌కు తరలించిన చిరుతల ఆరోగ్యం, ప్రవర్తనను పర్యవేక్షించేందుకు వెటర్నరీ శాస్త్రవేత్తల బృందం ఏర్పాటైంది. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాలో గల కునో నేషనల్ పార్క్ (కేఎన్‌పీ)లో నమీబియా నుంచి తీసుకొచ్చిన ఎనిమిది చిరుత(చీతా)ల పోస్ట్ క్వారంటైన్ సౌకర్యాన్ని పరిశీలించడానికి, వాటి ఆరోగ్యం, ప్రవర్తనను పర్యవేక్షించడానికి ఇక్కడి వెటర్నరీ సైన్స్ విశ్వవిద్యాలయం ముగ్గురు సభ్యుల శాస్త్రవేత్తల కమిటీని ఏర్పాటు చేసిందని మంగళవారం సంబంధిత అధికారి వెల్లడించారు.

కేఎన్‌పీ వద్ద చిరుతలను పర్యవేక్షిస్తున్న కేంద్ర ప్రభుత్వ బృందం అభ్యర్థన మేరకు నానాజీ దేశ్‌ముఖ్ వెటర్నరీ సైన్స్ యూనివర్సిటీ ఈ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. జాతీయ ఉద్యానవనంలో చిరుతలకు పోస్ట్ క్వారంటైన్ సదుపాయాన్ని పరిశీలించడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్‌పి తివారీ తెలిపారు. కమిటీలో యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ ఫోరెన్సిక్ అండ్ హెల్త్‌కు చెందిన డాక్టర్ దేవేంద్ర పొధాడే, డాక్టర్ సోమేష్ సింగ్, డాక్టర్ కేపీ సింగ్ సభ్యులుగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ బృందం అవసరమైనప్పుడు పార్కును సందర్శించి...చిరుతల ఆరోగ్యం, ప్రవర్తనను పరిశీలిస్తుంది. డాక్టర్ తివారీ చెప్పారు.

# దిల్లీ మంత్రి సత్యేందర్ జైన్ మసాజ్‌లో మరో ట్విస్ట్!

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ నేత, దిల్లీ మంత్రి సత్యేందర్ జైన్ మసాజ్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. మనీలాండింగ్ కేసులో తీహార్ జైలులో ఉన్న మంత్రికి మసాజ్ చేసింది ఫిజియోథెరపిస్ట్ అని ఆప్ వర్గాలు పేర్కొంటుండగా, కాదు... పోక్సో యాక్ట్ కింద శిక్ష అనుభవిస్తున్న నిందితుడు రింకూ అని జైలు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు మసాజ్ చేసింది ఓ రేపిస్ట్ అని బీజేపీ మండిపడుతోంది. రింకూ లైంగిక దాడి కేసులో నిందితుడని, పోక్సో చట్టంలోని సెక్షన్ 6, ఐపీసీ 376, 506, 509 కింద అభియోగాలు నమోదయ్యాయని జైలు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ నేత అల్కా లాంబ ఆప్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అమ్మాయిలపై లైంగిక దాడి చేసే వారితో సేవలు చేయించుకుంటున్నారని, ఆ తర్వాత వారిని రక్షిస్తారని ఆరోపించారు. సత్యేందర్ జైన్‌కు మసాజ్ చేసింది ఫిజియోథెరపిస్ట్ కాదని, రేపిస్ట్ అని బీజేపీ నేత షాజాద్ పూనావాలా ట్వీట్ చేశారు. తీహార్‌ను థాయ్‌లాండ్‌గా మార్చారని విమర్శించారు. సత్యేందర్ జైన్‌ను బర్తరఫ్ చేయాలని, అవినీతిని సమర్థించడం ఆపాలన్నారు. ఇదిలా ఉండగా, తీహార్ జైలులో సత్యేందర్ జైన్ బ్యారక్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫుటేజీలో ఓ వ్యక్తి సత్యేందర్ జైన్ పాదాలకు మసాజ్ చేస్తూ కనిపించాడు. ఈ ఫుటేజీని ఈడీ కోర్టుకు సైతం అందించింది. సత్యేందర్ జైన్ తీహార్‌లోని ఏడో నెంబర్ జైలులో ఉన్నాడు. అతడికి సౌకర్యాలు కల్పించినందుకు జైలు సూపరింటెండెంట్‌తో సహా నలుగురు జైలు అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేశారు. అదే సమయంలో 35 మందికిపైగా జైలు అధికారులు, సిబ్బందిని మార్చారు. మనీలాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్‌ను మే 30న ఈడీ అరెస్టు చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల విషయమై ఆయనపై కేసు నమోదు చేసింది. ఏప్రిల్‌లో జైన్ కుటుంబానికి చెందిన రూ.4.81 కోట్ల విలువైన స్థిరాలను జప్తు చేసింది.

# తండ్రే రెండుసార్లు కాల్చి చంపాడు

- పోస్టుమార్టం నివేదికలో వెల్లడి
- దిల్లీ యువతి హత్యపై పోలీసుల వివరణ

**మథుర:** గత వారం యూపీలోని యమునా ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ట్రాలీ బ్యాగ్‌లో లభించిన యువతి మృతదేహాన్ని దిల్లీలోని బదర్‌పూర్‌కు చెందిన 21 ఏళ్ల యువతి ఆయుషి యాదవ్‌గా పోలీసులు గుర్తించిన సంగతి విదితమే. యువతిపై రెండు సార్లు కాల్పులు జరిగాయని, కులాంతర వివాహం చేసుకోవడాన్ని సహించలేని యువతి తండ్రే ఆమెను రివాల్వర్‌తో కాల్చి చంపినట్లు సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ మార్తాండ్ ప్రకాశ్ సింగ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయుషి మృతదేహానికి ముగ్గురు వైద్యులతో కూడిన బృందం పోస్ట్‌మార్టం నిర్వహించింది. రెండు బుల్లెట్లు ఆమెపైకి దూసుకెళ్లాయని అందులో ఒకటి ఆమె ఛాతీ గుండా దూసుకుపోగా, మరొకటి తలలో ఇరుక్కుపోయిందని, పోస్టుమార్టం ప్రక్రియను వీడియో కూడా తీసినట్లు మార్తాండ్ వెల్లడించారు. కాల్పులు జరిపిన రివాల్వర్, మృతదేహాన్ని తీసుకెళ్లిన కారును స్వాధీనం చేసుకున్న తర్వాత ఆయుషి తండ్రిని ఆదివారం అరెస్టు చేయగా, సమాన భాగస్వామిగా పరిగణించి మరుసటి రోజు ఆయుషి తల్లిని పోలీసులు అరెస్టు చేశారు. భరత్‌పూర్‌లో నివసించే తన క్లాస్‌మేట్ ఛత్రపాల్ గుర్జార్‌ను ఆయుషి ఏడాది క్రితం ఆర్యసమాజ్ ఆలయంలో వివాహం చేసుకుంది. దీంతో ఆమె తండ్రి నితీష్ యాదవ్, తల్లి బ్రజ్‌బాల తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆమె ఇంటి నుంచి వారి వివాహ ధ్రువీకరణ పత్రాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెళ్లయ్యాక, ఆయుషి ఎప్పుడు కావాలంటే అప్పుడు భర్త ఇంటికి వెళ్లేది... ఇది తమ సామాజిక స్థితిని దెబ్బతీస్తోందని, పరువు పోతోందని ఆమె తల్లిదండ్రులు ఆందోళన చెందారు. సంఘటన జరిగిన రోజు గురువారం కూడా ఆమె తన భర్త వద్ద నుంచి తిరిగి వచ్చింది. తండ్రి కోపంతో తన రివాల్వర్‌తో ఆమెను హత్యచేశాడని, దీనికి తల్లి తన భర్తకు మద్దతుగా ఉందని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు ఆయుషిని ఒప్పించేందుకు మొదట్లో చాలా ప్రయత్నించినప్పటికీ పెద్దయ్యాక తన నిర్ణయాలను తానే తీసుకునే హక్కు ఉందని ఆమె తేల్చిచెప్పిందని పోలీసులు తెలిపారు. ఆయుషి దిల్లీ గ్లోబల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో బీసీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థిని. చదువులో ఎప్పుడూ ముందుంటుందని మార్తాండ్ చెప్పారు. ఆమె నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైనప్పటికీ ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. ఆమె డాక్టర్ కావాలనుకునేదని, దీనిపై ఆమె తల్లిదండ్రులు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఇదిలా ఉండగా, సోమవారం ఆమె తల్లిదండ్రులు లక్ష్మీ నగర్ ప్రాంతంలో ఆయుషి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. నేరానికి సంబంధించిన, నిందితుల కదలికలకు సంబంధించిన అనేక ఎలక్ట్రానిక్ ఆధారాలను కూడా పోలీసులు కనుగొన్నారు.

# మౌలికవసతులు కల్పించని మీకు ఓటెందుకు?

## బీజేపీ అసమర్థ వైఖరికి ప్రజల నిరసన

## ఉపాధి లేక యువత వలస బాట

## అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించాలని చాలా గ్రామాలు తీర్మానం

## గుజరాత్‌లో ఇదీ 'డబుల్ ఇంజిన్' ఘనత

**అహ్మద్‌నగర్:** మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యం, అసమర్థ వైఖరికి నిరసనగా రాబోయే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు గుజరాత్‌లోని చాలా గ్రామాల ప్రజలు తీర్మానించారు. తాగు, సాగునీరు కల్పించలేని బీజేపీకి ఓటెందుకు వేయాలని నిలదీస్తున్నారు. ఓ వైపు ఉపాధి లేక యువత వలసబాట పడుతుంటే అభివృద్ధిలో 'గుజరాత్ మోడల్'ను ఆదర్శంగా తీసుకోవాలంటూ సుద్దులు చెప్పే బీజేపీ పెద్దలకు... ఆ 'మోడల్' ఏపాటిదో ఆ రాష్ట్రంలోని పలు గ్రామాల ప్రజలు ముఖం మీద కొట్టినట్టు చెబుతున్నారు. ఎన్నో ఏండ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న బీజేపీ... తాగు, సాగునీటి వసతి కల్పించలేకపోయిందని, తమ బిడ్డలకు తగిన ఉపాధి అవకాశాలు చూపలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ తీరుకు నిరసనగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలను మూకుమ్మడిగా బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ పథకాలు తమకు రావడం లేదని మెహసానా జిల్లాలోని దాహోల్, దహిసనానా, వారేత గ్రామాల ప్రజలు నిరసనలకు దిగారు. తమ భూములకు సాగునీటి వసతి లేకపోవడం వల్ల బంజరు భూములుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి లేక యువకులు పట్టణాలకు వలస వెళ్లిపోతున్నారని వాపోయారు. తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, పాఠశాల భవనం లేక అహ్మదాబాద్‌కు సమీపంలోని చిలోడా గ్రామస్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేండ్ల క్రితమే అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామం విలీనమైనప్పటికీ, ప్రభుత్వం ఇంకా కనీస సౌకర్యాలు కల్పించలేదని గ్రామస్థులు మండిపడ్డారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వీధుల్లో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. బీజేపీ ప్రభుత్వ వ్యతిరేకతను ఎన్నికల బహిష్కరణ నిర్ణయం ప్రతిబింబిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే రానున్న ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకొన్న బీజేపీకి తాజా పరిణామం మింగుడు పడటం లేదు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకూ గుజరాతే స్వరాష్ట్రం కావడంతో ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా తయారయ్యాయి. మోర్బీ జిల్లాలోని గజాడి గ్రామస్థులు మంచినీటి కొరత వల్ల 2017లో అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించారు. జామ్ నగర్ జిల్లాలోని ధాంగోర్, డాంగ్ జిల్లాలోని దావ్‌లాద్ గ్రామాలూ గత ఎన్నికలను బహిష్కరించాయి.

## బీహార్ వ్యాపార సంస్థలపై ఐటీ దాడులు

**న్యూఢిల్లీ:** రియల్ ఎస్టేట్, వజ్రాభరణాల వ్యాపారం చేస్తున్న బీహార్‌కు చెందిన కొన్ని వ్యాపార సంస్థలపై ఇటీవల సోదాలు నిర్వహించిన తర్వాత ఆదాయపు పన్ను శాఖ రూ. 100 కోట్లకు పైగా లెక్కలు చూపని ఆదాయాన్ని గుర్తించినట్లు సీబీడీటీ మంగళవారం తెలిపింది. బీహార్‌లోని డెహ్రీ-ఆన్-సోన్, లక్నో, ఢిల్లీ, పాట్నా, భాగల్‌పూర్‌లోని దాదాపు 30 ప్రాంగణాలపై నవంబర్ 17న దాడులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో రూ.5 కోట్లకు పైగా విలువైన నగదు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని, 14 బ్యాంక్ లాకర్లను సీజ్ చేసినట్లు పన్ను శాఖకు సంబంధించిన విధానాన్ని రూపొందించే ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) తెలిపింది. బంగారం, వజ్రాల ఆభరణాల వ్యాపారంలో ఒక సంస్థకు చెందిన పత్రాలు, ఇతర వస్తువుల విశ్లేషణలో... ఆభరణాలు, దుకాణాలు, స్థిరాస్తుల కొనుగోలులో తమ 'లెక్కల్లో చూపని' ఆదాయాన్ని నగదు రూపంలో పెట్టుబడిగా పెట్టినట్లు తేలినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఈ గ్రూప్ ఖాతాదారుల నుంచి అడ్వాన్స్ రూపంలో తన ఖాతా పుస్తకాలలో 12 కోట్ల రూపాయలకు పైగా లెక్కలో లేని డబ్బును ప్రవేశపెట్టినట్లు కనుగొనడం జరిగింది. స్టాక్ భౌతిక పరిశీలనలో రూ.12 కోట్ల కంటే ఎక్కువ లెక్కలోకి రాని డబ్బును గుర్తించాం' అని వివరించింది. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్న మరొక సంస్థ విషయంలో... భూమి కొనుగోలు, భవనాల నిర్మాణం, అపార్ట్‌మెంట్ల అమ్మకంలో 'ఖాతాలో లేని' నగదు లావాదేవీలను కనుగొన్నట్లు తెలిపింది. 'ఒక ప్రముఖ ల్యాండ్ బ్రోకర్ కేసులో స్వాధీనం చేసుకున్న సాక్ష్యం పైన పేర్కొన్న లెక్కలు చూపని లావాదేవీలను మరింత ధ్రువీకరించింది. ఇలా లెక్కల్లో చూపని నగదు లావాదేవీల పరిమాణం రూ.80 కోట్లకు పైగానే ఉంది. గ్రూప్‌లోని కీలక వ్యక్తులు సంపాదించిన లెక్కలు చూపని ఆదాయాన్ని పెద్ద మొత్తంలో భూమితో సహా అనేక స్థిరాస్తుల కొనుగోలులో పెట్టుబడిగా పెట్టారు' అని ప్రకటన తెలిపింది.

## సులభతర వాణిజ్యం సరే...
# పరిశ్రమలేవి?

- రూ.10 కోట్ల లంచంతోనే జాకీ పరిశ్రమ వెనక్కి
- జగన్ పాలనతో రాష్ట్రం తిరోగమనం
- కడప ఉక్కు సంగతేంటి?
- మేనల్లుడికి రూ.10 వేల కోట్ల లబ్ధి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విశాలాంధ్ర- రాప్తాడు:** సీఎం వైఎస్ జగన్ చేతకాని పాలనతో రాష్ట్రం తిరోగమన బాట పట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. జగన్ అధికారం చేపట్టి మూడున్నరేళ్లయినా అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించి... పరిశ్రమలు తీసుకురావడం ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం... బెదరింపులు, దౌర్జన్యాలతో వచ్చిన పరిశ్రమలను వెనక్కి పంపుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో వైసీపీ నాయకుల ఆగడాలు శృతిమించాయన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రంలో టీడీపీ ప్రభుత్వం జాకీ పరిశ్రమకు కేటాయించిన స్థలాన్ని మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్‌తో కలిసి రామకృష్ణ పరిశీలించారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన అనంతపురం జిల్లాలో విద్యార్థులు తమ భవిష్యత్ కోసం పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలని, ఉద్యోగాలు రావాలని కోరుకుంటున్నారని, వైసీపీ ప్రభుత్వం మాత్రం యువత ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆరువేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వచ్చేవన్నారు. 'ఎన్నికలకు రూ.20 కోట్లు ఖర్చు పెట్టాను. ఇప్పుడు నాకు రూ.10కోట్లు ఇవ్వాలి' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేయడంతో జాకీ పరిశ్రమ తెలంగాణకు వెళ్లిందని రామకృష్ణ వివరించారు. సులభతర వాణిజ్యం'లో మనమే ప్రథమ స్థానంలో ఉన్నామని సీఎం జగన్ పదేపదే చెబుతున్నారని, అలాంటప్పుడు కొత్త పరిశ్రమలు ఎందుకు రావడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. 26 జిల్లాల్లో ఒక్క పరిశ్రమ వచ్చిందా...పదివేల మందికైనా ఉద్యోగాలు ఇచ్చారా...అని నిలదీశారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వైఎస్సార్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు...అడుగు ముందుకు పడలేదు...జగన్ సీఎం అయ్యారు...మళ్లీ శంకుస్థాపన చేశారు... అయినా ఇప్పటి వరకూ ఎలాంటి కార్యకలాపాలు సాగడం లేదని అన్నారు. రాష్ట్ర హక్కుల కోసం ప్రధాని మోదీని కనీసం అడగలేని పరిస్థితిలో సీఎం జగన్ ఉన్నారని విమర్శించారు. జాకీ పరిశ్రమ జీఎంను రూ.10 కోట్లు డిమాండ్ చేసి... పరిశ్రమ ఇక్కడి నుంచి పారిపోవడానికి కారణమైన ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిపై ఎలాంటి చర్య తీసుకుంటారని జగన్‌ను ప్రశ్నించారు. జాకీ పరిశ్రమను అనంతపురం జిల్లాకు తెప్పించాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని రామకృష్ణ హెచ్చరించారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్‌లో గల రూ.10వేల కోట్ల ఆస్తులను సీఎం జగన్ మేనల్లుడు రామాంజులరెడ్డి కొట్టేస్తున్నారని ఆరోపించారు. రూ.10వేల కోట్ల విలువైన భూమిని కేవలం రూ.500 కోట్లకే చట్టపరంగా స్వాధీనం చేసుకుంటున్నారని మండిపడ్డారు. అతివృష్టి, అనావృష్టితో రైతులు అల్లాడుతుంటే కనీసం పరిశ్రమలు తీసుకురావడం ద్వారా యువతకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి ఉండటం దారుణమని వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలతో సమావేశమై...పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడం ద్వారా ఈ గుడ్డి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

జగదీశ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో వచ్చిన కియా పరిశ్రమ వల్ల లక్షలమంది ఉపాధి పొందుతున్నారన్నారు. 27 ఎకరాల్లో జాకీ పరిశ్రమ స్థాపనకు నాటి ప్రభుత్వం ప్రయత్నిస్తే...జగన్ ప్రభుత్వం ముడుపుల కోసం రాష్ట్రం వదిలి వెళ్లేలా చేసిందని విమర్శించారు. రామగిరి గనులను ఎప్పుడు తెరిపిస్తారని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు సి.మల్లి కార్జున, పి.నారాయణ స్వామి, నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, తలారి నారాయణస్వామి, రమణయ్య, రాజేశ్, సంతోశ్, ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, మండల కార్యదర్శులు రమేశ్, రవీంద్ర, రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయిస్వామి, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, నాగరాజు, వెంకట నారాయణ, పోతన్న, ఏఐవైఎఫ్ నేత ధనుంజయ, చలపతి, మౌలాలి, పెద్దన్న, రఫీ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## జీవిత చరిత్రలు భవిష్యత్ తరాలకు ఆదర్శం

### కాకి మాధవరావు 'బ్రేకింగ్ బారియర్స్' పుస్తకావిష్కరణలో వక్తలు

**విశాలాంధ్ర-విజయవాడ:** కీలక పదవులు అలంకరించిన ప్రముఖులు తమ జీవిత విశేషాలను పుస్తకరూపంలో తీసుకురావటం వల్ల చారిత్రక విషయాలు భవిష్యత్ తరాలకు తెలుస్తాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కాకి మాధవరావు తన స్వీయ చరిత్ర 'బ్రేకింగ్ బారియర్' పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమెస్కో ప్రచురించిన ఈ పుస్తకాన్ని సామాజిక ఉద్యమకారులు బెజవాడ విల్సన్ ఆవిష్కరించారు. ఎమెస్కో అధినేత విజయకుమార్ అధ్యక్షతన విజయవాడలోని హోటల్ ఫార్చ్యూన్ మురళీపార్కులో మంగళవారం జరిగింది. బెజవాడ విల్సన్ మాట్లాడుతూ మన విద్యావ్యవస్థలో సమాజ పరిణామాన్ని చెబుతున్నారు గానీ...ఏదైనా సమస్య ఎదురైతే ఎలా పరిష్కరించుకోవాలో చెప్పటం లేదన్నారు. సత్యం చెప్పటానికి ఇష్టం లేని విధంగా పరిస్థితులు మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 75ఏళ్ల స్వాతంత్ర్య ప్రజాస్వామ్య వ్యవస్థలో చేతులతో మలమూత్రాలు ఎత్తడం ఏమిటని ప్రశ్నించారు. రేపిస్టులు, హంతకులు జైలు నుంచి విడుదలైతే ఘనస్వాగతాలు, సంబరాలు చేసుకుంటున్నారని, ఇంతటిదారుణ పరిస్థితుల్లో సమాజంలో ఉన్నందుకు చింతిస్తున్నామన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ నేడు రాజకీయాలు, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు లక్ష్మణరేఖ దాటుతున్నాయని చెప్పారు. చంద్ర రాజేశ్వరరావును జీవితచరిత్ర రాయమని చాలామంది కోరితే...రాస్తే నిజాలు రాయాలని, అవి ఇబ్బందులు కలిగిస్తాయని చెప్పేవారని గుర్తుచేశారు. ఐఏఎస్ అధికారులు ఎక్కడ ఉన్నా ఒక్కటేనని, వారు ఎందుకో భయపడుతున్నారని చెప్పారు. గతంలో చిత్తూరు జిల్లాలో 4వేల ఎకరాల భూమికి సంబంధించి పేదల పక్షాన పరిధి దాటి పోరాటం చేసినట్లు గుర్తు చేసుకున్నారు. రాజకీయాలు పవిత్రమని భావించి ఈ రంగంలో ఉన్నానని తెలిపారు. కాకిమాధవరావు రాసిన పుస్తకంలో దామోదరం సంజీవయ్య నుంచి నారా చంద్రబాబునాయుడు వరకు అనేక అంశాలు ఉన్నాయన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం మాధవరావు నిజాయతీతో పని చేశారని చెప్పారు. నారాయణ ప్రసంగం ప్రారంభిస్తూ జాస్తి అంటే ఎంతో మాట్లాడతారనుకున్నామని, కానీ ఆయన చాలాక్లుప్తంగా మాట్లాడారని జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌ను ఉద్దేశించి చమత్కరించారు. ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్, అంబేద్కర్ సినిమా నిర్మాత, సామాజిక ఉద్యమకారిణి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు.

## ఏపీ పోలీసు సంక్షేమం తీరు ఆక్షేపణీయం: వర్ల

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పోలీసు సంక్షేమ సంఘం నేతల తీరు సరిగ్గా లేదంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వర్ల రామయ్య మాట్లాడుతూ చట్టానికి కట్టుబడి ఉన్నామంటున్న అసోసియేషన్ పెద్దలు, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న సీఐడీ చీఫ్ సునీల్ కుమార్‌పై నోరు ఎందుకు మెదపలేదంటూ నిలదీశారు. చట్టం ప్రకారమే పనిచేస్తామని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేయలేమని తీర్మానించి, దాన్ని సీఎంకు పంపే ధైర్యముందా? అని ప్రశ్నించారు.

## పదోన్నతులు-విధుల్లో వివక్ష

- సుప్రీం కోర్టులో 34 మంది మహిళా సైన్యాధికారుల పిటిషన్
- ఇలాంటివి జరగనివ్వొద్దు : కేంద్రానికి సీజేఐ ఆదేశం

**న్యూఢిల్లీ:** సాయుధ దళాల్లో మహిళలకు వివక్ష తప్పడం లేదని, తమకు పదోన్నతులు కల్పించడం లేదని, సీనియర్లుగా ఉండి జూనియర్ పురుషుల కింద పనిచేయాల్సి వస్తోందని 34 మంది మహిళా సైన్యాధికారులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు... బబితా పూనియా కేసులో 2020, ఫిబ్రవరిలో వెలువరించిన చరిత్రాత్మక తీర్పు ప్రకారం తమ విషయంలో ఎలాంటి చర్యలు లేకపోవడాన్ని పిటిషన్‌లో మొరపెట్టుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు మహిళా అధికారులను ఉన్నత ర్యాంకులకు ఎంపిక అమలు జరగడంలేదని, తమను కల్నల్ ర్యాంకుకు పదోన్నతి కల్పించేలా సెలక్షన్ బోర్డులు ఏర్పాటు కాలేదన్నారు. పురుష అధికారుల కోసం ఎంపిక బోర్డులు ఉన్నాయంటూ 34 మంది లెఫ్టినెంట్-కల్నల్ ర్యాంకు మహిళా అధికారుల పిటిషన్‌ను సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీ ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపున న్యాయవాది వి.మోహనా వాదనలు వినిపించారు. మహిళా అధికా రులకు స్టడీ లీవ్, డిప్యూటేషన్ నిరాకరిస్తూ అన్యాయం చేస్తున్నారని, వ్యవస్థాగత-పరోక్ష-లింగ వివక్ష కొనసాగుతోందని కోర్టుకు తెలిపారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే ఆర్మీ వంటి వ్యవస్థలో జూనియర్ జెంటిల్‌మెన్ అఫీసర్ల కింద సీనియర్ మహిళా అధికారులు పనిచేయాల్సి వస్తోందన్నారు. వీరికి అదనపు అధికారులుగా పోస్టింగులిస్తున్నారని, సాధారణంగా మేజర్ లేక కెప్టెన్ స్థాయి అధికారులు నిర్వర్తించాల్సిన విధులకుగాను వీరిని సూపర్‌సీడెడ్ (భర్తీ) లేక తిరిగి విధుల్లోకి తీసుకొన్న (రీ-ఎంప్లాయిడ్) వారిగా పరిగణిస్తున్నారన్నారు. వాదనలు విన్న తర్వాత సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీ ధర్మాసనం కేంద్రప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఇలాంటి పరిస్థితులు మరలా రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా అధికారులు ఫిర్యాదు చేసిన పరిస్థితులు ఉంటే పురుషుల కోసం ఎంపిక బోర్డులు ఉండకూడదని పేర్కొంది. ఇదే విషయంలో కేంద్రప్రభుత్వం తరపు న్యాయవాది ఆర్ బాలసుబ్రమణియన్ స్పందిస్తూ ఇప్పటికే సెలక్షన్ బోర్డు భేటీ జరిగిందని తెలుపగా, అయితే ఫలితాలను ప్రకటించవద్దు అని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో అలాగే చేస్తామన్న న్యాయవాది... మహిళా అధికారులు ఏ విధంగానూ వివక్షకు గురికాకుండా చూస్తామని కోర్టుకు హామీనిచ్చారు.

## 'వాల్తేరు వీరయ్య' సెట్‌లో పవన్ సందడి

**హైదరాబాద్:** 'వాల్తేరు వీరయ్య' సెట్‌లో పవన్‌కల్యాణ్ సందడి చేశారు. చిరు స్టెప్పులను చూసి మురిసి పోయా రు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వాల్తేరు వీరయ్య' సెట్‌కి పవన్‌కల్యాణ్, దర్శకుడు క్రిష్, ఎ.ఎం.రత్నం వెళ్లారు. పవన్‌కు చిరు స్వయంగా కొన్ని సన్నివేశాలను చూపించారు. బుధవారం విడుదల కానున్న 'బాస్ పార్టీ' సాంగ్ గ్లింప్స్‌ను కూడా పవన్ వీక్షించారు. అనంతరం చిరుతో కాసేపు ముచ్చటించారు. ప్రస్తుతం ఈ ఫొటోలో నెట్టింట వైరల్ అవుతున్నాయి. చిరంజీవి, శ్రుతీహాసన్ నటీనటులుగా రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. మైత్రీ మూవీమేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

**నేడు 'ఫస్ట్ సింగిల్' విడుదల:** ఈ సినిమా నుంచి నవంబరు 23 సాయంత్రం 4.05 గంటలకు ఫస్ట్ సింగిల్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ పాటకు సంబంధించిన గ్లింప్స్ వీడియోను చిత్రబృందం పంచుకుంది. "వెల్కమ్ టు ద బిగ్గెస్ట్ పార్టీ... బాస్ పార్టీ' అంటూ ఈ హుషారైన గీతం ప్రారంభమవుతుంది. అనంతరం, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్... 'నువ్వు లుంగీ ఎత్తుకో, నువ్వు షర్ట్ ముడి వేసుకో, నువ్వు కర్చీఫ్ కట్టుకో... బాస్ వస్తుండు, బాస్ వస్తుండు' అంటూ పక్కా మాస్ పదజాలాన్ని కురిపించడం ఈ ప్రోమో వీడియోలో చూడొచ్చు. మొత్తానికి ఇది టైటిల్ సాంగ్ అని అర్థమవుతోంది. ఈ పాటను నకాష్ అజీజ్, హరిప్రియలతో కలిసి దేవిశ్రీ ప్రసాద్ కూడా ఆలపించారు. ఈ గీతానికి దేవిశ్రీనే సాహిత్యం అందించారు. ఈ పాటలో బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలా మెగాస్టార్ సరసన నృత్యం చేసినట్లు తెలుస్తోంది

## విడాకులా? అంతా వట్టిదే: శ్రీకాంత్



**హైదరాబాద్:** సినీ నటుడు శ్రీకాంత్, ఆయన భార్య ఊహ విడాకులు తీసుకుంటున్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలపై శ్రీకాంత్ స్పందిస్తూ, ఒక ప్రెస్ నోట్ ను విడుదల చేశారు. ఇలాంటి పనికిమాలిన వార్తలు ఎవరు పుట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను చనిపోయినట్టు గతంలో ఒక పుకారు పుట్టిం చారని ఆ వార్తను చూసి తన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని చెప్పారు. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తాము విడాకులు తీసుకుంటున్నామని కొత్త పుకారు పుట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని వెబ్ సైట్లలో వచ్చిన ఈ ఫేక్ న్యూస్‌ను ఊహకు నా ఫ్రెండ్స్ ఫార్వర్డ్ చేశారని... ఆమె కంగారు పడుతూ ఆ పోస్టులను తనకు చూపించిందని చెప్పారు. ఇలాంటివి చూసి ఆందోళన చెందొద్దని ఊహను తాను ఓదార్చానని తెలిపారు. తాను, ఊహ చెన్నైకు వచ్చి, ఇక్కడి నుంచి దైవ దర్శనానికి అరుణాచలంకు వెళ్తున్నాం... ఇలాంటి తరుణంలో ఇలాంటి తప్పుడు వార్తలు తమ కుటుంబానికి చాలా చికాకును తెప్పిస్తున్నాయని శ్రీకాంత్ అన్నారు. ఈ తప్పుడు వార్త మరింత ప్రచారం కాకుండా ఆపేందుకు ప్రెస్ నోట్ విడుదల చేస్తున్నానని చెప్పారు.




## పుష్ప-2లో కేథరిన్?

**హైదరాబాద్:** అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పుష్ప 2' సినిమాలో నటిస్తోందంటూ కేథరిన్ పేరు తెరపైకి వచ్చింది. ఈ సినిమాలో నెగెటివ్ షేడ్స్ కలిగిన లేడీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో ఆమె కనిపించనుందని అంటున్నారు. 'పుష్ప' అంతు చూస్తానంటూ ఆ ఫారెస్టులోకి ఆమె ఎంట్రీ ఇస్తుందని అంటున్నారు. ఆమె బాడీ లాంగ్వేజ్ ను కూడా డిఫరెంట్ గా డిజైన్ చేశారని చెబుతున్నారు. బన్నీతో కేథరిన్ ఇంతకుముందు 'ఇద్దరమ్మా యిలతో' .. 'సరైనోడు' వంటి సినిమాలు చేసింది. ఇక ఇప్పుడు 'పుష్ప 2' కోసం కూడా ఆమెను రంగంలోకి దింపనున్నట్టుగా తెలుస్తోంది. రష్మిక కథానాయికగా అలరించనున్న ఈ సినిమాకి, దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూర్చుతున్నాడు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ సినిమా విడుదల ఉంటుందని సమాచారం.

# అసోం-మేఘాలయ సరిహద్దులో హింస

### పోలీసు కాల్పుల్లో అటవీ శాఖ గార్డు సహా ఆరుగురి మృతి

**గువహటి :** అసోం-మేఘాలయ సరిహద్దులోని ముక్రో ప్రాంతంలో హింస చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున పశ్చిమ కర్బీ అంగ్లాంగ్ జిల్లాలోని అసోం-మేఘాలయ సరిహద్దులో అక్రమ కలప రవాణా చేస్తున్న ట్రక్కును అడ్డగించడంతో జరిగిన హింసలో ఒక అటవీ శాఖ గార్డు సహా ఆరుగురు మరణించారని అధికారులు తెలిపారు. ఈ సంఘటన తరువాత అసోం పోలీసులు మేఘాలయ సరిహద్దులో ఉన్న అన్ని జిల్లాలలో శాంతిభద్రతల పరిస్థితిని అదుపుచేసేందుకు అప్రమత్తం చేసినట్లు మరొక అధికారి తెలిపారు. తెల్లవారుజామున 3 గంటలకు మేఘాలయలోని పశ్చిమ జైంతియా హిల్స్ జిల్లా వైపు అక్రమ కలపను తరలిస్తున్న ముక్రో ప్రాంతంలో అసోం అటవీ శాఖ బృందం ట్రక్కును ఆపిందని వెస్ట్ కర్బీ అంగ్లాంగ్ పోలీసు సూపరింటెండెంట్ ఇమ్దాద్ అలీ పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. ట్రక్కు వేగంగా ముందుకు వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా, అటవీ శాఖ గార్డులు దానిపై కాల్పులు జరిపి ట్రక్కు టైర్ గాలిని తీసేశారు. వాహనం డ్రైవర్‌తో పాటు మరొకరిని పట్టుకోగా, ఇతరులు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అటవీ శాఖ గార్డులు జిరికెండింగ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించడంతో పోలీసు బందోబస్తును రంగంలోకి దించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న తర్వాత, మేఘాలయ నుంచి 'దావోస్' (బాకులు), ఇతర ఆయుధాలతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఉదయం 5 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకొని, అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అటవీ శాఖ గార్డులు, పోలీసు సిబ్బందిని గుంపు ఘెరావ్ చేసి, వారిపై దాడి చేశారు. ఈ క్రమంలో అసోం పోలీసులు జరిపిన కాల్పుల్లో మేఘాలయకు చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఎదురు దాడిలో అసోం అటవీ శాఖ హోంగార్డు మరణించాడు. తాజా పరిస్థితుల సున్నితత్వం దృష్ట్యా మేఘాలయలోని ఏడు జిల్లాల్లో రెండు రోజుల పాటు ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులను కాల్పులు జరపడానికి ప్రేరేపించిందని పోలీసు అధికారి అలీ చెప్పారు. ఈ ఘటనలో మేఘాలయకు చెందిన ఖాసీ వర్గానికి చెందిన ఒక అటవీ శాఖ హోం గార్డు, మరో ఐదుగురు మృతి చెందారని ఎస్పీ తెలిపారు. 'పరిస్థితి ఇప్పుడు అదుపులో ఉంది' అని ఆయన అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు ఆ మారుమూల ప్రాంతానికి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. అయితే, బిద్యాసింగ్ లెఖ్తే అనే అటవీ శాఖ గార్డుతో సహా గాయపడిన వారు బుల్లెట్ గాయాలతో మరణించారా లేదా మరేదైనా ఆయుధం తగిలిందా అనేది స్పష్టంగా తెలియలేదు. ఇదిలా ఉండగా, మేఘాలయ సరిహద్దులో ఉన్న అన్ని జిల్లాల్లో అలర్ట్ ప్రకటించామని, తమ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కోరినట్లు పోలీసు అధికారి ఒకరు ఇక్కడ తెలిపారు. 'మేఘాలయలోని జిల్లాల పోలీసు సూపరింటెండెంట్‌లందరికీ సాధ్యమయ్యే ఏదైనా శాంతిభద్రతల పరిస్థితిపై కఠినమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. కానీ అంతర్ రాష్ట్ర సరిహద్దు వెంబడి వాహనాలు లేదా ప్రజల రాకపోకలపై ఎటువంటి ఆంక్షలు లేవు' అని అన్నారు. తాజా ఘటన పై మేఘాలయ ముఖ్యమంత్రి సంగ్మా ట్విట్టర్ వేదికగా స్పందించారు. సరిహద్దు కాల్పుల ఘటన పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు ధ్రువీకరించారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఘటన పై మేఘాలయ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. అసోం-మేఘాలయ మధ్య 884.9 కి.మీ పొడవైన అంతర్ రాష్ట్ర సరిహద్దులోని 12 ప్రాంతాలలో చాలా కాలంగా వివాదం ఉంది. రెండు ఈశాన్య రాష్ట్రాలు తమలో ఆరింటిలో వివాదానికి ముగింపు పలికేందుకు మార్చిలో న్యూఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. మిగిలిన ఆరు ప్రాంతాల్లోని వివాదాల పరిష్కారానికి రెండు రాష్ట్రాలు చర్చలు కూడా ప్రారంభించాయి. మేఘాలయ 1972లో అస్సాం నుంచి వేరయింది.

# టీమిండియాదే టీ20 సిరీస్

### కివీస్‌తో మూడో టీ20 మ్యాచ్ 'టై'

**నేపియర్:** భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మంగళవారం జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్ 'టై' గా ముగిసింది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయే సమయానికి టీమిండియా 9 ఓవర్లలో 75/4 స్కోరు చేసింది. డక్వర్త్ లూయిస్ నిబంధనల ప్రకారం మ్యాచ్‌ను 'టై' అయినట్లు ప్రకటించారు. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ 1-0 ఆధిక్యంతో సొంతం చేసుకుంది. న్యూజిలాండ్ విధించిన 161 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా టాప్ ఆర్డర్ తడబడింది. రెండో టీ20లో అద్భుతంగా ఆడిన ఇషాన్ కిషన్ (10)తోపాటు రిషభ్ పంత్ (11), సూర్యకుమార్ యాదవ్ స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే మరోవైపు కెప్టెన్ హార్దిక్ పాండ్యా (30 నాటౌట్: 18 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో 9 ఓవర్లకు నాలుగు వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. ఈ క్రమంలో వర్షం రావడం టీమిండియాకి కలిసొచ్చింది. డక్వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 76 పరుగులు చేస్తే విజయం, 75 చేస్తే టైగా ముగుస్తుంది. భారత్ సరిగ్గా 75 పరుగులు చేయడంతో ఓటమి నుంచి తప్పించుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా సిరాజ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా సూర్యకుమార్ ఎంపికయ్యారు. కివీస్ బౌలర్లలో సౌథీ 2 వికెట్లు, మిల్నే, ఇష్ సోధి చెరో వికెట్ పడగొట్టారు. కాగా టాస్ గెలిచిన న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్ చేసింది. అయితే భారత బౌలర్లు అర్షదీప్ సింగ్ (4/37), సిరాజ్ (4/17) విజృంభించడంతో కివీస్ 19.4 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ డెవాన్ కాన్వే అర్ధ సెంచరీతో చెలరేగాడు. అతడికి గ్లెన్ ఫిలిప్స్ సహకారం అందించాడు. అయితే వీళ్లిద్దరితో ఔటవడంతో పాటు మిగతా బ్యాటర్లు రాణించక పోవడంతో కివీస్ పూర్తి ఓవర్లు ఆడకుండానే వెనుదిరిగింది. అయితే కాన్వే, ఫిలిప్స్ కారణంగా న్యూజిలాండ్ గౌరవప్రదమైన స్కోరు చేయ గలిగింది. నిజానికి భారీ స్కోరు దిశగా వెళ్తున్న కివీస్‌ను భారత బౌలర్లు నిలువరించారు. అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ చెరో 4 వికెట్లతో చెలరేగారు. భువనే శ్వర్‌కు వికెట్లు ఏమీ దక్కలేదు. హర్షల్ పటేల్ ఒక్క వికెట్ తీశాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోయి టైగా ముగియడం భారత టీ20 చరిత్రలో ఇదే తొలిసారి. అయితే అంతర్జా తీయంగా మాత్రం మూడో మ్యాచ్. గతేడాది (2021) నెదర్లాండ్స్-మలేషియా... మాల్టా-మార్సా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు ఇలా టైగా ముగిశాయి.

## ఫిఫా ప్రపంచకప్‌లో సంచలనం

### సౌదీ అరేబియా చేతిలో అర్జెంటీనా చిత్తు

**దోహా:** ఖతార్‌లో జరుగుతున్న ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లో సౌదీ అరేబియా జట్టు సంచలనం సృష్టించింది. మంగళవారం లుసెయిల్ స్టేడియంలో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో సౌదీ అరేబియా 2-1 గోల్స్‌తో అర్జెంటీనాను ఓడించింది. 51వ ర్యాంక్‌లో ఉన్న సౌదీ అరేబియా మూడో ర్యాంక్‌లో ఉన్న అర్జెంటీనాను చిత్తు చేయడం విశేషం. మ్యాచ్ ఆరంభమైన 10వ నిమిషంలో మెస్సీ అర్జెంటీనాకు తొలి గోల్ సాధించాడు. పెనాల్టీ కార్నర్ ద్వారా ఆ గోల్ సాధించాడు. కాగా 48వ నిమిషంలో సౌదీ అరేబియా ఫార్వర్డ్ ఆటగాడు సలేహ్ అల్ షెహ్రీ తమ జట్టుకు మొదటి గోల్ అందించాడు. మిడ్‌ఫీల్డర్ సలీం అల్ దవ్సారీ 53వ నిమిషంలో రెండో గోల్ సాధించడంతో సౌదీ అరేబియా విజేతగా నిలిచింది. ఫిఫా ప్రపంచకప్‌లో పాల్గొంటున్న మేటి జట్లలో అర్జెంటీనా ఒకటి. మ్యాచ్ మొదలవ్వడానికి ముందు మెస్సీ కెప్టెన్సీలోని అర్జెంటీనా జట్టు, సౌదీ అరేబియాను చిత్తుగా ఓడిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ, సౌదీ అరేబియా ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో రెండు గోల్స్ చేశారు. దాంతో, అర్జెంటీనా అభిమానులు షాక్‌లో ఉండిపోయారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.